తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
వరంగల్ - ఆదిలాబాద్
హన్మకొండ | జనగాం | ములుగు | నిర్మల్ | మంచిర్యాల | ప్రొ. జయశంకర్ భూపాలపల్లి | కొమురం భీం ఆసిఫాబాద్ | మహబూబాబాద్
శుక్రవారం
10 జూలై 2026
పేజీలు - 8



# 'నషా ముక్త్ భారత్ అభియాన్'కు శ్రీకారం

- రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పిలుపు
- డ్రగ్స్ వ్యతిరేక పోస్టర్ల ఆవిష్కరణ
- విద్యార్థులు, యువతతో ప్రతిజ్ఞ అవగాహన ర్యాలీ ప్రారంభం

**హనుమకొండ ప్రతినిధి, జూలై 09 (జనం సాక్షి) :** మత్తు పదార్థాల నిర్మూలనను ప్రజా ఉద్యమంగా మార్చి, డ్రగ్స్ రహిత భారత్ – డ్రగ్స్ రహిత తెలంగాణ సాధనకు ప్రతి పౌరుడు బాధ్యతగా కృషి చేయాలని రాష్ట్ర గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా పిలుపునిచ్చారు. గురువారం హనుమకొండ ఐడీఓసీ (కలెక్టరేట్)కు చేరుకున్న గవర్నర్‌కు ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులు ఘన స్వాగతం పలికారు.

వార్త మెయిన్ 7లో

# గ్రామ పంచాయతీలను ఆర్థికంగా బలోపేతం చేయాలి

- ప్రణాళికాబద్ధమైన పాలనతోనే గ్రామాభివృద్ధి సాధ్యం
- గ్రామాభివృద్ధిలో సర్పంచులదే కీలక పాత్ర
- 16వ ఆర్థిక సంఘం నిధులను నిబంధనల ప్రకారమే వినియోగించాలి
- మంత్రి దనసరి అనసూయ సీతక్క



**ములుగు ప్రతినిధి, జులై 09(జనంసాక్షి) :** గ్రామ పంచాయతీలను ఆర్థికంగా బలోపేతం చేయాలని, ప్రణాళికాబద్ధమైన పాలనతోనే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని, గ్రామాభివృద్ధిలో సర్పంచులే కీలకపాత్ర పోషించాల్సి ఉంటుందని,16వ ఆర్థిక సంఘం నిధులను నిబంధనల ప్రకారమే వినియోగించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు.

వార్త మెయిన్ 3లో

# జోరుగా బెల్ట్ షాపుల దందా!

- బెల్ట్ షాప్ నిర్వహణపై నిలదీసిన గ్రామపౌరుడు
- పౌర హక్కులకు భంగం కలిగించేలా దుర్భాషలు
- పంకెన బస్టాండ్ లో పాఠశాల గేటు వద్దే మందుబాబుల హల్‌చల్
- ప్రయాణికులు, విద్యార్థుల బెంబేలు.. పట్టించుకోని అధికారులు
- బెల్ట్ షాప్ యజమానులకు పౌర హక్కులపై అవగాహన కల్పించాలి



**పలిమెల( జులై 09 జనం సాక్షి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెల మండలంలో బెల్ట్ షాపులలో మద్యం విక్రయాలు హద్దులు దాటుతూ మండలంలో నిబంధనలకు విరుద్ధంగా పల్లెపల్లెనా వెలిసిన బెల్ట్ షాపులు నడుస్తూ ఉంటే గ్రామ పౌరుడు ఒక బెల్ట్ షాప్ యజమానిని నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నారని తెలపడం తో బెల్ట్ షాపు యజమాని హద్దులు దాటి ప్రవర్తిస్తూ పౌరునిగా సమాజ శ్రేయస్సుకోసం మాట్లాడితే పౌర హక్కులకు భంగం వాటిల్లేలా దుర్భాషలాడుతూ పైగా నన్ను ఎవరు ఏం చేయలేని నేను అందరికీ మామూల్లు ఇచ్చే బెల్ట్ షాపు వ్యవహారం నడుపుతున్నానని ఏ శాఖ నన్ను ఏం చేయలేదని అనడం గమనార్హం ఇది విన్న పలువురు గ్రామస్తులు ఆశ్చర్యపోయారని సమాచారం. ఎక్సైజ్ శాఖ అధికారుల 'మామూళ్ల' మత్తు కారణంగానే బెల్ట్ షాప్ యాజమానులు హద్దులు దాటి ప్రవర్తిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. మామూళ్ల పర్వం తో దాడులు చేయాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో బెల్ట్ షాపు యజమానులతో పాటు మందుబాబుల ఆగడాలకు అడ్డూఅదుపూ లేకుండా పోతున్నాయి. పంకెన గ్రామంలో పరిస్థితి మరీ ఘోరంగా తయారైంది. ఇక్కడి ప్రభుత్వ పాఠశాల ప్రధాన గేటు, బస్టాండ్ రెండు పక్కపక్కనే ఉంటాయి. ఇదే ఇప్పుడు మందుబాబులకు అనుకూలంగా అడ్డగా మారింది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా



కొందరు మద్యం ప్రియులు ఎదురుగా ఉన్న బెల్ షాపులో మద్యం విక్రయించి ప్రయాణికులు కూర్చునేలా ఏర్పాటుచేసిన బెంచీలలో కూర్చొని బహిరంగంగా మద్యం సేవిస్తున్నారు. తెల్లారేసరికి తాగి పారేసిన బీరు సీసాలు, క్వార్టర్ బాటిళ్లు బస్టాండ్ ఆవరణలో దర్శనమిస్తున్నాయి. మిగతా 11లో..



# ఐటీ కంపెనీల్లో కార్లు అటాచ్‌మెంట్ ఇప్పిస్తామని మోసం

- ఇద్దరిని అరెస్టు చేసిన పోలీసులు
- మూడు కార్లు, ఒక మొబైల్ ఫోన్ స్వాధీనం

**వరంగల్ ఈస్ట్ , జూలై 09 (జనంసాక్షి) :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఏ.జే. మిల్స్ కాలనీ పోలీసులు వాహన యజమానులను ఐటీ కంపెనీల్లో అటాచ్‌మెంట్ ఇప్పిస్తామని నమ్మించి కార్లు తీసుకుని, వాటిని ఇతరుల వద్ద తాకట్టు పెట్టి లక్షల రూపాయలు కాజేసిన ముఠాకు చెందిన ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి మూడు కార్లు, ఒక మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

మొహమ్మద్ సోహైల్ అనే బాధితుడి మారుతి డిజైర్ కారును నెలకు రూ.35 వేల అద్దె వస్తుందని నమ్మించి నిందితుడు సింగారపు శ్యామ్ కుమార్ తీసుకున్నాడు. మొదట అడ్వాన్స్‌గా రూ.35 వేలు చెల్లించిన అనంతరం వాహనాన్ని ఇతరుల వద్ద తాకట్టు పెట్టి, అద్దె చెల్లించకుండా మోసానికి పాల్పడినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఇదే తరహాలో పలువురు వాహన యజమానులను మోసం చేసినట్లు విచారణలో తేలింది. గురువారం తెలంగాణ జంక్షన్ వద్ద నిర్వహించిన వాహన తనిఖీలలో అనుమానాస్పదంగా ప్రయాణిస్తున్న సింగారపు శ్యామ్ కుమార్ (ఎ 1), ఎం.డి. సోహైల్ (ఏ 2)లను అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించారు. వారి వద్ద నుంచి ఒక మారుతి డిజైర్ కారును స్వాధీనం చేసుకోవడంతో పాటు, వారి సమాచారంతో చింతల్ ఫ్లైఓవర్ కింద దాచిపెట్టిన మరో రెండు కార్లు (మారుతి ఎర్టిగా, మారుతి బలెనో) మరియు నేరాలకు ఉపయోగించిన హెచ్ఎమ్‌డీ కీప్యాడ్ మొబైల్ ఫోన్‌ను మిగతా 11లో..

# నిర్మల్‌లో ట్రాఫిక్‌కు ప్రత్యేక కార్యాచరణ

### ఎస్పీ జానకి షర్మిల ఆదేశాలతో ప్రత్యేక బృందం ఏర్పాటు

**నిర్మల్ బ్యూరో , జూలై 09, (జనంసాక్షి ) జూలై 9:** పట్టణంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని నియంత్రించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఆదేశించారు. ఈ మేరకు డీఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ బృందం బస్టాండ్, ఆటో స్టాండ్, అంబేద్కర్ చౌక్, మయూరి హోటల్ సమీపం, కిసాన్ షాపింగ్ మాల్ పరిసరాలతో పాటు అధిక రద్దీ ఉన్న ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించనుంది. రహదారులను ఆక్రమించి వ్యాపారం నిర్వహిస్తున్న వారితో చర్చించి ట్రాఫిక్‌కు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోనున్నారు. అలాగే అక్రమ పార్కింగ్‌ను అరికట్టి వాహనాలను నిర్దేశిత పార్కింగ్ స్థలాల్లోనే నిలిపేలా చర్యలు చేపట్టనున్నారు. ప్రత్యేక ట్రాఫిక్ నిర్వహణ కార్యక్రమం శుక్రవారం నుంచి అమల్లోకి రానుందని ఎస్పీ తెలిపారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ పోలీసు శాఖకు సహకరించాలని, రహదారులను ఆక్రమించకుండా ఉండాలని, వాహనాలను నిర్ణీత



పార్కింగ్ ప్రదేశాల్లోనే నిలిపివేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీఐలు కృష్ణ, సమ్మయ్య, ఆర్ఐలు రామ్ నిరంజన్, రామకృష్ణ, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడుల బలోపేతమే లక్ష్యం

- ప్రతి చిన్నారిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి
- రాయిగూడ సర్పంచ్ పెందూర్ లక్ష్మణ్‌రావు

**సిరికొండ (జనం సాక్షి) జులై 08** ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం, ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య అందించడమే తమ లక్ష్యమని రాయిగూడ గ్రామ సర్పంచ్ పెందూర్ లక్ష్మణ్ అన్నారు. బుధవారం మండలంలోని రాయిగూడ గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఆయన విద్యార్థులతో ముచ్చటించి బోధన, హాజరు వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు పుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం తదితర సంక్షేమ పథకాల ప్రయోజనాలు విద్యార్థులకు అందుతున్నాయని తెలిపారు. ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలన్నారు. గ్రామంలో ఒక్క విద్యార్థి కూడా చదువుకు దూరం కాకుండా డ్రాప్‌అవుట్లు లేకుండా చూడడం అందరి బాధ్యతని పేర్కొన్నారు. ప్రతి చిన్నారిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు గ్రామస్థులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు



సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శృతి, ఉపాధ్యాయుడు పెందూర్ సీతారాం, అంగన్‌వాడీ టీచర్ యమునా, కారోబారి పంద్రం విజయ్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# సీపీఎస్ నీ వెంటనే రద్దు చేయాలి..

### మండల ఉద్యోగుల సంఘం నాయకులు చిక్కాల సతీష్ యాదవ్




**పెద్దవంగర జులై 09(జనం సాక్షి )** సీపీఎస్ నీ వెంటనే రద్దు చేయాలి మండల సీపీఎస్ ఉద్యోగుల సంఘం నాయకులు చిక్కాల సతీష్ యాదవ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో అంబేత్కర్ విగ్రహం వద్ద పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా చిక్కాల సతీష్ మాట్లాడుతూ.ఉద్యోగ విరమణ అనంతరం పెన్షన్ పొందడం ఉద్యోగి హక్కు. ఎవరి దయాధర్మము బిక్ష కాదని సుప్రీంకో ర్టు ఇచ్చిన తీర్పును విస్మరించి మన పాలకులు మా నెత్తిన సీపీఎస్ ను రుద్దారు.ఎవరికి లాభం ఈ కొత్త పెన్షన్ విధానం అని ప్రశ్నించుకుంటే ఉద్యోగులకి కాదు ప్రభుత్వానికి కాదు కేవలం షేర్ మార్కెట్లో పెట్టుబడిదారులకి మాత్రమేనని స్పష్టమవుతుంది. బహుల జాతి కంపెనీల వ్యాపార పెట్టుబడిగా మా చందా సొమ్ము ఉపయోగపడుతుంది..ఇట్టి సీపీఎస్ ను రద్దు చేయాలని మండల శాఖ పక్షాన డిమాండ్ చేస్తున్నాం. అన్నారు.టీ ఎస్ సిపిఎస్ఇయూ ఆధ్వర్యంలో జరిగే జన జాగరణ యాత్రను విజయ వంతం చేయాలని కోరారు.. ఈ కార్యక్రమంలో బండకింది సత్య నారాయణ,విద్యా సాగర్,బాలరాజు,మహబూబి,సురేష్,ప్రదీప్,వెంకటేశ్వర్లురాధిక,అనూష,ఎశబోయినవెంకన్న,సోమన్న,సురేందర్,రాజమణి,మధు,తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంత ప్రజలకు మీసేవ కేంద్రాలది కీలకపాత్ర




**నెరడిగొండ జులై9(జనంసాక్షి):** గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత సులభంగా,పారదర్శకంగా అందుబాటులోకి రావడంలో మీసేవ కేంద్రాలది కీలక పాత్ర పోషిస్తున్నాయని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి ఆడే గజేందర్ పేర్కొన్నారు.గురువారం రోజున మండలంలోని వడూర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన మీసేవ కేంద్రాన్ని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత సులభంగా, పారదర్శకంగా అందుబాటులోకి రావడంలో మీసేవ కేంద్రాలు కీలక పాత్రపోషిస్తున్నాయని అన్నారు.కుల ఆదాయ నివాస ధ్రువీకరణ పత్రాలు జనన మరణ ధ్రువపత్రాలు, పింఛన్ సంక్షేమ పథకాల దరఖాస్తులు తదితర ప్రభుత్వ సేవలను ప్రజలు ఒకే చోట పొందేలా మీసేవ కేంద్రాలుఉపయోగపడతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మీసేవ కేంద్రం నిర్వాహకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పేదింటి ఆడపడుచు వివాహానికి అండగా నిలిచిన ఓకేఆర్



**ఖానాపూర్ రూరల్ 9 జూలై (జనం సాక్షి):** ఖానాపూర్ పట్టణంలోని పద్మావతి నగర్ కాలనీకి చెందిన నిరుపేద కుటుంబశీ రాపర్తి అనూష రాజన్న కుమార్తె నైనిక వివాహం నిశ్చయం కాగా వారి కుటుంబానికి గురువారం ఐదు వేల రూపాయలు ఓ కే ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఒడ్డే పల్లి కృష్ణం రాజు వారి మిత్ర బృందం తో కలిసి కుటుంబానికి అందించారు. ఈ కార్యక్రమంలో ఒకే ఆర్ మిత్రబృందం, కాలని వాసులు పాల్గొన్నారు.

## బీడీ ఆకులు కోసింది ఒకరు డబ్బులు తీసునేది మరొకరు

- ఆకులు సేకరించిన రైతులను ఎగొట్టి స్వంత మనుషుల ఖాతలలో డబ్బులు వెహించుకున్న అధికారి

**చింతలమానేపల్లి: జులై 9( జనం సాక్షి )** గూడెం,బూరుగుడా బీడీ ఆకు కల్లాలలో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయి.రెక్కాడితే గాని డొక్కాడని పేద రైతుల శ్రమను ఓ అధికారి తన సొంత మనుషుల ఖాతాల్లోకి మళ్లించినట్లు తెలుస్తోంది.బాధితులు తమకు న్యాయం చేయాలంటూ జిల్లా అటవీ శాఖ అధికారిని ఆశ్రయించినట్లు సమాచారశీ.గూడెం, బూరుగుడా (ఊా) గ్రామాల్లోని బీడీ ఆకు కల్లాల పరిధిలో మొత్తం 140 వేజ్ కార్డుల ద్వారా రైతులు సుమారు తొమ్మిది రోజుల పాటు బీడీ ఆకును సేకరించి అటవీ శాఖ కొనుగోలు కేంద్రాలకు తరలించారు. ప్రభుత్వం ఒక్కో బీడీ ఆకు కట్టకు రూ. 3.40 చొప్పున చెల్లిస్తోంది. అయితే, ఇక్కడి ఓ అధికారి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. లబ్ధిదారులైన 13 మంది రైతుల పేర్లను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయకుండా,వారి కట్టలను కట్ చేసి,ఆమెకు అత్యంత సన్నిహితులైన పేర్లపై అక్రమంగా ఆన్‌లైన్ చేశారని బాధితులు వాపోతున్నారు.ప్రభుత్వ ఆన్‌లైన్ రికార్డుల ప్రకారం.దేశ్ముఖ్ ప్రవీణ్ (జాబ్ కార్డ్ నం: 21264059100136) ఖాతాలో ఏకంగా 28,737 కట్టలను నమోదు చేసి రూ. 97,705.80 రూ,అలాగే రౌతు గణపతి (జాబ్ కార్డ్ నం: 21264058600077) ఖాతాలో 12,408 కట్టలను నమోదు చేసి రూ. 42,187.20 కేటాయించారు.మరోవైపు కల్లాల్లో రాత్రిం బవళ్లు కష్టపడిన నీకాడి మధుకర్ (రూ. 12,212), దేశ్ముఖ్ స్వప్న (రూ. 14,412), కోటేల శంకర్ (రూ. 15,102), కాటల రామక్క (రూ. 12,083), కేడవోల్ కొండయ్య (రూ. 10,370), కొంపర్ సత్తన్న (రూ. 10,574) లతో పాటు దందరే ఓంకార్, లట్కార్ రంగయ్య, ఎడిగం బక్కు, దేవర సచిన్, డుబ్బుల జయప్రద, దేశ్ముఖ్ భిచ్చయ్య, డోకే వనిత అనే 13 మంది రైతుల పేర్లను ఆన్‌లైన్ నుండి పూర్తిగా మాయం చేశారు.ఈ వ్యవహారంపై క్షేత్రస్థాయి విచారణ జరిపి, అక్రమాలకు పాల్పడిన ఆ అధికారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని, అలాగే నష్టపోయిన బాధితులకు వారి బీడీ ఆకు డబ్బులను ఇప్పించి న్యాయం చేయాలని ఉన్నతాధికారులను కోరుతున్నారు.

# దిలావర్పూర్ జూనియర్ కళాశాలలో సర్ పై అవగాహన సదస్సు





**దిలావర్పూర్, జూలై 09, (జనం సాక్షి):** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' సర్ అంశంపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఆర్ఓ అజీజ్ ఖాన్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. ఎన్నికల సంఘం చేపట్టిన ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమం ద్వారా ఓటర్ల జాబితాలో పేర్లను సరిచూసుకోవడం, కొత్తగా అర్హులైన యువత ఓటరుగా నమోదు చేసుకోవడం అత్యంత కీలకమని పేర్కొన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి విద్యార్థి తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు తక్షణమే ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. సదస్సు అనంతరం విద్యార్థులు వెంటనే స్పందించారు. స్థానిక అంగన్వాడీ కేంద్రంలో బీఎల్ఓలతో కలిసి సర్ ఫారాలు పూరించడంలో నిమగ్నమయ్యారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి. సుదర్శన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి మాలెపు కృష్ణ, సీనియర్ అధ్యాపకులు రామారావు, ఇతర అధ్యాపకులు, సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# దొరల బంగ్లాలో గుడుంబా అమ్మకాలు అరికట్టాలి



**రామకృష్ణాపూర్, జులై09(జనంసాక్షి):** మందమర్రి పట్టణంలోని దొరల బంగ్లా ప్రాంతంలో గుడుంబా అమ్మకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయని, వాటిని వెంటనే అరికట్టాలని బస్తీవాసులు డిమాండ్ చేశారు. గురువారం నిర్వహించిన సమావేశంలో గొర్రె రామచందర్, కనకం రవీందర్, బచ్చలి సురేందర్, బత్తుల సరిత మాట్లాడుతూ గత ఇరవై ఐదు ఏళ్లుగా గుడుంబా విక్రయాలు కొనసాగుతున్నాయని, వాటిని ప్రోత్సహిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. గత రెండేళ్లలో గుడుంబా వ్యసనంతో పదిహేను మంది మృతి చెందారని, దీంతో అనేక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. యువత వ్యసనాలకు బానిస కాకుండా ఆబ్కారీ శాఖ ప్రత్యేక దాడులు నిర్వహించి గుడుంబా అమ్మకాలను పూర్తిగా అరికట్టాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సంపత్, వెంకటేశ్వర్లు, బాసాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సర్ ప్రక్రియను వేగవంతం చేయాలి

## తహసిల్దార్ సతీష్ కుమార్ శర్మ



**రామకృష్ణాపూర్, జులై 09(జనంసాక్షి):** భారత ఎన్నికల కమిషన్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్ ప్రక్రియను మరింత వేగవంతం చేస్తున్నట్లు మందమర్రి తహసిల్దార్ పనకంటి సతీష్ కుమార్ శర్మ తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని మూడో వార్డులో బిఎల్ఓ లు చేస్తున్న పనితీరును గురువారం పరిశీలించారు. బిఎల్ఓ లు ప్రతి ఇంటికి రావడం లేదంటూ పలు వార్డు ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి వారి సందేహాలకు సమాధానం చెప్పారు. బిఎల్ఒ లు ప్రతి ఇంటింటికి వెళ్లి ప్రతి ఓటరుకు ఫారం అందజేయాలని సూచించారు. అలాగే ఊర్లో లేని ఓటర్లకు చరవాణి ద్వారా సమాచారం అందజేయాలన్నారు. ఈనెల 24 వ తారీకు వరకు సర్ ప్రక్రియ పూర్తి చేసి ఓటరు నుండి వివరాలను ఫారం ద్వారా స్వీకరించాలని బిఎల్ఒ లను ఆదేశించారు. తహసిల్దార్ వెంట జిపిఓ ప్రతిభ, బిఎల్ఒ సంతోషిరాణి ఉన్నారు.

# ఏరియా ఆసుపత్రిలో తొలిసారి హిప్ రీప్లేస్‌మెంట్ శస్త్రచికిత్స



**రామకృష్ణాపూర్, జూలై 09(జనంసాక్షి):** రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రిలో తొలిసారిగా టోటల్ హిప్ రీప్లేస్‌మెంట్ (టీహెచ్ఆర్) శస్త్రచికిత్సను వైద్యులు విజయవంతంగా నిర్వహించారు. డివై సీఎంఓ డా. మధుకుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శస్త్రచికిత్సతో ఆసుపత్రి మరో మైలురాయిని చేరుకుంది. ఇటీవల టోటల్‌నీ రీప్లేస్‌మెంట్ (టీకేఆర్) శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించిన అదే వైద్య బృందం, ఇప్పుడు హిప్ రీప్లేస్‌మెంట్ శస్త్రచికిత్సను కూడా విజయవంతంగా పూర్తి చేసింది. ఆర్థోపెడిక్ వైద్యులు డా. సుహాసిని, డా. నరేష్, అనస్తీషియా వైద్యురాలు డా. మైత్రి నిపుణుల బృందంతో కలిసి ఈ క్లిష్టమైన శస్త్రచికిత్సను నిర్వహించారు. ఆర్కేఎన్‌టీ గనికి చెందిన ఐలయ్య (తండ్రి: శ్రీనివాస్)కు ఈ శస్త్రచికిత్స చేయగా, ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉండి వైద్యుల పర్యవేక్షణలో కోలుకుంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా డివై సీఎంఓ డా. మధుకుమార్ మాట్లాడుతూ, మందమర్రి జీఎం రాధాకృష్ణ, సీఎంవో డా. కిరణ్‌రాజ్ సహకారంతో ఆసుపత్రిలో ఆధునిక వైద్య సేవలను విస్తరిస్తూ ప్రజలకు నాణ్యమైన చికిత్స అందిస్తున్నామని పేర్కొన్నారు. శస్త్రచికిత్స విజయవంతం కావడంలో ఆపరేషన్ థియేటర్ ఇన్‌చార్జి జ్యోతి సిస్టర్, థియేటర్ సిబ్బంది, నర్సింగ్ సిబ్బంది, ఇతర ఆసుపత్రి సిబ్బంది కృషి చేశారని అభినందించారు.

# ఘనంగా మంత్రి సీతక్క జన్మదిన వేడుకలు



**వాజేడు జులై 9 ( జనం సాక్షి )** ములుగు జిల్లా వాజేడు మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క జన్మదిన వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు ప్రసాద్ బాబు ఇంటి ఆవరణంలో జన్మదిన వేడుకలు నిర్వహించి కేక్ కట్ చేశారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్ బాబు కాంగ్రెస్ పార్టీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ చెన్నం ఎల్లయ్య ఆధ్వర్యంలో ఈ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా కాకర్లపూడి విక్రాంత్ మాట్లాడుతూ గిరిజన కుటుంబంలో పుట్టిన ఆమె ఎంతో ఎత్తుకు ఎదిగి మంత్రిగా ములుగు జిల్లాకు ఎనలేని సేవలు అందిస్తున్నారని కొనియాడారు ఆమెలాగా మహిళలు మహిళ ప్రజా ప్రతినిధులు పనిచేయాలని ఈ సందర్భంగా కోరారు ములుగు జిల్లాకే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఆమె సేవలను అందిస్తూ ప్రజల ఆశీస్సులను పొందుతున్నారని ఆయన అన్నారు ఆమె నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని కోరుకుంటున్నామని తెలియజేశారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వాజేడు మండల మాజీ అధ్యక్షులు దాట్ల సీతారామరాజు సొసైటీ ఉపాధ్యక్షులు వత్సవాయి జగన్నాథరాజు మాజీ జెడ్పిటిసి తల్లడి పుష్పలత వాజేడు నాగారం సర్పంచ్ బోధిబోయిన స్వరూప ఆత్మ డైరెక్టర్ గౌరారపు వెన్నెల వార్డ్ మెంబర్ జాక పార్వతి కాంగ్రెస్ పార్టీ నాయకులు కాకర్లపూడి కళ్యాణ్ ఎస్కే కాజావాలి షబ్బీర్ , చెన్నం శ్రీను , చెన్నం సురబాబు చెన్నం మోహన్ రావు ఎట్టి లక్ష్మయ్య అనుముల సంజీవ్.

# తాడిచెర్ల బ్లాక్-2 సింగరేణికి కేటాయింపులో మంత్రి శ్రీదర్ బాబు కృషి

## ఈజీసి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దండు రమేష్



**మల్హర్,జులై 09( జనం సాక్షి)** తాడిచెర్ల బ్లాక్-2 సింగరేణికి కేటాయింపులో రాష్ట్ర ఐటి,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీదర్ బాబు కృషి ఎనలేనిదని రాష్ట్ర ఈజిసి కౌన్సిల్ సభ్యుడు దండు రమేష్ అన్నారు. గురువారం మండల కేంద్రమైన తాడిచెర్లలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు 2014లో అప్పటి కేసీఆర్ ప్రభుత్వం ప్రయివేటుకు కట్టబెట్టడానికి ప్రయత్నం చేస్తే ప్రతిపక్ష నేతగా శ్రీదర్ బాబు పోరాటం అడ్డుకున్నట్లుగా తెలిపారు. ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి రోశయ్య దృష్టికి శ్రీదర్ బాబు బ్లాక్-3ను సింగరేణికి కేటాయించేలా కేంద్రపై ఒత్తిడి పెంచినట్లుగా గుర్తు చేశారు. 2024లో మంత్రి శ్రీదర్ బాబు నేతృత్వంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క అప్పటి కేంద్ర బొగ్గుగానుల శాఖ మంత్రిని కలిసి తాడిచెర్ల బ్లాక్-2ను సింగరేణికె కేటాయింపు చేయాలని విజ్ఞప్తి చేసినట్లుగా అందుకు ప్రస్తుత కేంద్ర బొగ్గుగనుల మంత్రి బండి సంజయ్ ఒకే చెప్పినట్టుగా తెలిపారు. తాడిచెర్ల బ్లాక్-2ను సింగరేణికి కేటాయింపులో కృషి చేసిన కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి బండి సంజయ్,మంత్రి శ్రీదర్ బాబు,ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి ఇందారపు చెంద్రయ్య,కేశారపు చెంద్రయ్య,ఆకుల శ్రీనివాస్,రాగంరమేష్,మధు,రాజసమ్మయ్య,ఇందారపురవిందర్,కొము రయ్య, శంకర్ పాల్గొన్నారు.

# బాల్య తండా గ్రామ పంచాయతీని అభివృద్ధి చేయడమే నా లక్ష్యం

## సర్పంచ్ జర్పుల కాలు నాయక్



**మరిపెడ జూలై 9 (జనం సాక్షి)** మరిపెడ మండలం లోని బాల్య తండా గ్రామపంచాయతీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడ మే తన లక్ష్యమని స్థానిక సర్పంచ్ జర్పుల కాలు నాయక్ అన్నారు. మరిపెడ మండలం బాల్య తండా గ్రామపంచాయతీ పరిధిలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) కింద రూ. 10 లక్షల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జర్పుల కాలు నాయక్ మాట్లాడుతూ, గ్రామ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. గ్రామంలోని అంతర్గత రహదారులను దశలవారీగా అభివృద్ధి చేసి ప్రజలకు సౌకర్యవంతమైన రవాణా కల్పిస్తామని చెప్పారు. ప్రభుత్వ నిధులను పారదర్శకంగా వినియోగించి గ్రామాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బాల్య తండా పెద్దలు, యువకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కేక్ కట్ చేసి, మొక్కలు నాటి... గుడుంబాకు నో చెప్పిన గంగారం సర్పంచులు




**గంగారం జులై 9 (జనం సాక్షి)** తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రివర్యులు, ములుగు ఎమ్మెల్యే డా. దనసరి అనసూయ సీతక్క జన్మదిన వేడుకలను గంగారం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క పుట్టినరోజు వేడుకలను కేక్ కట్ చేసి ఆనందాన్ని వ్యక్తం చేశారు. అనంతరం హరిత తెలంగాణలో భాగంగా మండల కేంద్రంలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గంగారం మండల సర్పంచులు కీలక తీర్మానం చేశారు. మంత్రి సీతక్క జన్మదిన పురస్కరించుకొని గంగారం మండలాన్ని గుడుంబా రహిత మండలంగా తీర్చిద్దాలని ఏకగ్రీవ తీర్మానం చేశారు. యువతను చెడు వ్యసనాల బారి నుండి కాపాడి, ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా గ్రామాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని సర్పంచులు పేర్కొన్నారు. కార్యక్రమం అనంతరం పండ్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యూత్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, సీతక్క అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా మంత్రి సీతక్క జన్మదిన వేడుకలు



**ఏటూరునాగారం, జూలై 09(జనంసాక్షి).** రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క జన్మదినాన్ని పురస్కరించుకుని ఏటూరునాగారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దేవులపల్లి విజయ్ కుమార్ నాయకత్వంలో ముందుగా కేక్ కట్ చేసి మంత్రి సీతక్కకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఏటూరునాగారం ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు అరటి పండ్లు, బ్రెడ్‌లు పంపిణీ చేసి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. మంత్రి సీతక్క జన్మదినాన్ని సేవా దినోత్సవంగా నిర్వహించడం ద్వారా ప్రజాసేవ పట్ల తమ నిబద్ధతను చాటుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కరోనా మహమ్మారి సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా గిరిజన ప్రాంతాలు, మారుమూల గ్రామాల్లో ప్రజలకు ఆహారం, మందులు, నిత్యావసర వస్తువులు అందిస్తూ వేలాది కుటుంబాలకు అండగా నిలిచిన మానవతామూర్తి మంత్రి సీతక్క అని కొనియాడారు. అధికారంలోకి రాకముందు నుంచి మంత్రి అయిన తర్వాత కూడా ప్రజాసేవనే లక్ష్యంగా పెట్టుకుని నిరంతరం ప్రజల మధ్య ఉంటూ సేవలందిస్తున్న నాయకురాలని ప్రశంసించారు. ములుగు నియోజకవర్గ అభివృద్ధికి మంత్రి సీతక్క విశేష కృషి చేస్తున్నారని, రోడ్లు, వంతెనలు, విద్య, వైద్యం, సాగునీరు, గిరిజన సంక్షేమం వంటి అనేక రంగాల్లో అభివృద్ధి పనులు చేపడుతూ ప్రజల విశ్వాసాన్ని చూరగొన్నారని తెలిపారు. ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావించే మంత్రి సీతక్కకు ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు కలగాలని ఆకాంక్షించారు. అదేవిధంగా ములుగు జిల్లా ఆత్మ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయనున్న చిటమట రఘుకి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, రైతుల సంక్షేమం కోసం ఆయన సమర్థవంతంగా సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఏ డైరెక్టర్ వసంత శ్రీనివాస్, ఏటూరు నాగారం ఆత్మ చైర్మన్ కర్ల అరుణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇర్సవడ్ల వెంకన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి గుడ్ల దేవేందర్, సర్పంచ్ గద్దల నవీన్, పిఏసిఎస్ వైస్ చైర్మన్ చెన్నూరు బాలరాజు, ములుగు మాజీ కోఆప్షన్ సభ్యురాలు వలియాబి సలీం, నాయకులు దేవులపల్లి విజయ్ కుమార్, రంజిత్, గంపల శివకుమార్, తాజ్, వావిలాల చిన్న ఎల్లయ్య, వావిలాల నర్సింహ రావు, పోలెబోయిన గోపాల్, సర్వ అక్షిత్, సాయి, ఠాగూర్, లక్కీ, పడిదల హనుమంత్, జాడి రవీందర్, రాధిక, ఉదయ, గికురు భాగ్య, రమాదేవి, చిక్కుల మానస తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ యువత ఒకే తాటిపైకి రావాలి...

- ఉపాధి సాధన సమితి పిలుపు,
- చెన్నారావుపేట కాంగ్రెస్ మండల నాయకులు, పిఏసిఎస్ మాజీ వైస్ చైర్మన్ తొగరు చెన్నా రెడ్డి.




**చెన్నారావుపేట, జులై 9 ( జనం సాక్షి):** మండల పరిధిలోని నిరుద్యోగ యువతీ యువకులను సంఘటితం చేయడానికి వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి ఒక ప్రత్యేక వేదికను ఏర్పాటు చేస్తున్నట్లు చెన్నారావుపేట కాంగ్రెస్ మండల నాయకులు, చెన్నారావుపేట పిఏసిఎస్ మాజీ వైస్ చైర్మన్ తొగరు చెన్నా రెడ్డి ఒక ప్రకటనలో గురువారం తెలిపారు. మన మండలానికి సమీపంలోనే కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ ఉన్నప్పటికి స్థానిక యువతకు సరైన శిక్షణ, ఉపాధి అవకాశాలు లభించడం లేదని అందుకుగాను చెన్నారావుపేట మండల కేంద్రంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక నైపుణ్య శిక్షణా కేంద్రాన్ని (స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ) ఏర్పాటు చేయాలని కోరుతున్నట్లు తెలిపారు. మండలంలో డిగ్రీ, డిప్లొమా, ఐటిఐ, బీటెక్ వంటి చదువులు పూర్తి చేసి ఖాళీగా ఉన్న యువతీ యువకుల వివరాలను సేకరించి, స్థానిక శాసనసభ్యులు దొంతి మాధవ రెడ్డి, జిల్లా కలెక్టర్ సత్య శారదలకు ఒక సమగ్ర నివేదిక (రిప్రెసెంటేషన్ ) ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. కావున చెన్నారావుపేట మండలంలోని అన్ని గ్రామాలు, తండాలకు చెందిన నిరుద్యోగ యువతీ,యువకులు తమ పేరు, ఊరు, విద్యార్హత, ఫోన్ నంబర్ వివరాలను క్రింది నంబర్(9642734300)కు వాట్సాప్ ద్వారా పంపాలని తెలిపారు. మండల కేంద్రంలో త్వరలోనే జరగబోయే నిరుద్యోగుల సన్నాహక సమావేశానికి అందరూ హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# విట్టోలి గ్రామంలో సర్ ప్రక్రియకు శ్రీకారం

## సర్పంచ్ రుచిత దిగంబర్ ఆధ్వర్యంలో అవగాహన



**ముధోల్ ,జూలై 09( జనం సాక్షీ )** ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ సర్‌లో భాగంగా గురువారం విట్టోలి గ్రామ పంచాయతీ యందు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రుచిత దిగంబర్ పాల్గొని మాట్లాడుతూ, గ్రామంలోని ప్రతి ఒక్కరూ ఎలాంటి తప్పులు లేకుండా ఏనుమరేషన్ ఫార్మ్‌ను పూర్తి చేసి గార్లకు అందజేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఈ ప్రక్రియలో పాల్గొని తమ పేర్లు, వివరాలు సరిచూసుకోవాలని, ఈ పనిని త్వరిత గతిన పూర్తి చేయాలని ఆమె తెలిపారు. ఎవరైనా పేరు కొత్తగా చేర్పించుకోవడం, తొలగింపు, సవరణలు ఉంటే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి పాల్గొని ప్రజలకు ఫార్మ్ పూరించే విధానం గురించి వివరించారు.

# విట్టోలి గ్రామంలో హరితహారం సందడి

- ప్రతి కుటుంబానికి 6 మొక్కల పంపిణీ




**ముధోల్ జులై 09 (జనం సాక్షి)** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న హరితహారం కార్యక్రమంలో భాగంగా గురువారం గ్రామ పంచాయతీ విట్టోలి యందు మొక్కల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. గ్రామ సర్పంచ్ రుచిత దిగంబర్ ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రతి ఒక్క కుటుంబానికి 6 మొక్కల చొప్పున పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమకు ఇచ్చిన 6 మొక్కలను తప్పనిసరిగా నాటి వాటిని సంరక్షించాలని, గ్రామంలో పచ్చదనం పెంచి భావితరాలకు మంచి పర్యావరణాన్ని అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నాయకులు కూడా స్వయంగా మొక్కలు నాటి ప్రజలకు ఆదర్శంగా నిలిచారు. గ్రామాన్ని హరిత గ్రామంగా మార్చేందుకు అందరూ కలిసి కృషి చేయాలని ఈ సందర్భంగా నిర్ణయించారు.

# రాష్ట్రస్థాయి ఆట్యా పాట్యా క్రీడా పోటీలకు జల్లి విద్యార్థి

- అభినందించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెద్ది వెంకటేశ్వరరావు



**చెన్నారావుపేట, జూలై 9 ( జనం సాక్షి):** రాష్ట్రస్థాయి ఆట్యా పాట్యా క్రీడా పోటీలకు జల్లి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థి ఎంపికయ్యాడు. ఈనెల 8వ తేదీన నర్సంపేట మిని స్టేడియంలో వరంగల్ జిల్లా ఆట్యా పాట్యా అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్ 14 ఇయర్స్ క్రీడా ఎంపికలో జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థి జరుపుల శివ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెద్ది వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ క్రీడా పోటీలకు ఎంపికైన జరుపుల శివ ఈనెల 11, 12 తేదీలలో సిద్దిపేటలో జరిగే రాష్ట్రస్థాయి ఆట్యా పాట్యా క్రీడా పోటీలలో పాల్గొంటాడని పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ జి. బిక్షపతి నాయక్ తెలిపారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ ఈర్య, ఉపాధ్యాయ బృందం అనిత, సుభాష్, అశోక్, శ్రీనివాస్, కుమారస్వామిలు పాల్గొని విద్యార్థిని జరుపుల శివను అభినందించారు.

## సమన్వయంతో పనిచేసి గ్రామాలను అభివృద్ధి దిశలో నడిపించాలి

### జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు




**ఖానాపూర్ రూరల్ 9 జూలై (జనం సాక్షి):** పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు సమన్వయం తో పని చేసి గ్రామాలను అభివృద్ధి దిశలో నడిపించాలి అని నిర్మల్ జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం సత్తనపల్లి రైతు వేదిక భవన్ నాలుగు మండలాల సర్పంచ్ లు ,పంచాయతీ కార్యదర్శుల తో ఏర్పాటు చేసిన, గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి శిక్షణ తరగతుల కు ముఖ్యఅతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామపంచాయతీ పనులను ప్రణాళిక పరంగా చేసి గ్రామాల్లో ఉన్న చెత్తను వేరు చేసి నాణ్యమైన కంపోస్ట్ ను తయారు చేయాలని అన్నారు.అలాగే గ్రామాల్లోని గ్రామ పంచాయతీ లలో ఆదర్శ జీ పి గా తీర్చిదిద్ది ఆదర్శంగా నిలవాలని కోరారు.గ్రామ పంచాయతీ నిధులను జీ పి డి పి పొందు పరిచి ఖర్చు చేయాలని అన్నారు. ఈ సందర్భంగా సత్తనపల్లి గ్రామంలోని సోఫిట్,మొక్కల పెంపకాన్ని పరిశీలించి మునగ చెట్లను నాటారు. ఈ కార్యక్రమంలో డీఎల్పిఓ లింగయ్య, ఎమ్పిఓలు అనిల్,రమేష్ రెడ్డి, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

## పగటి చోరీ కేసు ఛేదన..7 తులాల బంగారం స్వాధీనం

### నిందితుడి అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు




**నిర్మల్, జూలై 9 (జనంసాక్షి):** నిర్మల్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల జరిగిన పగటి చోరీ కేసును పోలీసులు వేగంగా ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేశారు. జిల్లా ఎస్పీ డా. జి. జానకి శర్మిల, ఆదేశాల మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు సాంకేతిక ఆధారాలు, ఇతర సాక్ష్యాల ఆధారంగా నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు చేసిన నిందితుడు దావుల సుమన్ (29), నేరడిగొండ మండలం గుత్పాల గ్రామానికి చెందిన డ్రైవర్‌గా పోలీసులు తెలిపారు. ఈ నెల 6న నిర్మల్ పట్టణంలోని ఆదర్శనగర్‌లో పరంకుశం వెంకటరమణ నివాసంలో జరిగిన చోరీకి ఇతడే పాల్పడినట్లు దర్యాప్తులో తేలిందన్నారు. నిందితుడి వద్ద నుంచి సుమారు ఏడు తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు, అతడిని అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించారు. ఈ కేసును త్వరితగతిన ఛేదించిన నిర్మల్ టౌన్ పోలీస్ స్టేషన్ అధికారులను, సిబ్బందిని జిల్లా ఎస్పీ డా. జి. జానకి శర్మిల అభినందించారు.

## జిల్లా ప్రధాన న్యాయమూర్తిని మర్యాదపూర్వకంగా కలిసిన కలెక్టర్, ఎస్పీ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన జె. జీవన్ కుమార్ ను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన బాధ్యతలు చేపట్టిన జిల్లా ప్రధాన న్యాయమూర్తికి పుష్పగుచ్ఛాలు అందజేసి శు భాకాంక్షలు తెలిపారు. అనంతరం పెండింగ్‌లో ఉన్న వివిధ కోర్టు కేసుల పురోగతిపై చర్చించారు. కేసుల త్వరితగతిన పరిష్కారానికి, న్యాయ ప్రక్రియ మరింత వేగవంతం కావడానికి జిల్లా యంత్రాంగం తరపున పూర్తి సహకారం ఉంటుందని ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి శ్రీమతి జి.అఖిల పాల్గొన్నారు.

## విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలి

### కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె.హరి

**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జులై 09(జనంసాక్షి ):** ప్రభుత్వ పాఠశాలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని జిల్లా కలెక్టర్ కెహరిత అన్నారు. గురువారం జిల్లాలోని కెరమెరి మండలం పెద్దపట్నాపూర్ లో గల గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థుల హాజరు పట్టిక, వంటగది, తరగతి గదులు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేస్తూ విద్యార్థులకు అవసరమైన సకల సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించే దిశగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ క్రమంలో డ్రాప్ అవుట్ విద్యార్థులను గుర్తించి సోమవారంలోగా పాఠశాలలో ఉండేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని, ప్రతి విద్యార్థి ఆధార్ కార్డు కలిగి ఉండేలా చూడాలని తెలిపారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, విద్యార్థులకు నాణ్యమైన



విద్యతో పాటు మధ్యాహ్న భోజనంలో మెనూ ప్రకారం రుచికరమైన పౌష్టిక ఆహారం, శుద్ధమైన త్రాగునీరు అందించాలని తెలిపారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## డ్యూటీ మీట్‌ల ద్వారా వృత్తి నైపుణ్యాన్ని సాధించవచ్చు

### • వరంగల్ సిపి శ్వేత, ఐపీఎస్ • ముగిసిన భద్రాద్రి జోనల్ జోనల్ పోలీస్ డ్యూటీ మీట్

**వరంగల్ బ్యూరో, జూలై 09 (జనం సాక్షి)** గత మూడు రోజుల నుండి వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో మామూనూరు పోలీస్ శిక్షణ కేంద్రంలో నిర్వహిస్తున్న భద్రాద్రి జోనల్ పోలీస్ డ్యూటీ మీట్ గురువారం ఘనంగా ముగిసాయి. మూడురోజుల నిర్వహించిన ఈ డ్యూటీ మీట్‌లో జోనల్ పరిధిలో వరంగల్, ఖమ్మం పోలీస్ కమిషనరేట్లతో పాటు, మహబుబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన పోలీస్ అధికారులు కంప్యూటర్ పరిజ్ఞానం, ఫోరెన్సిక్ సైన్స్, ఫింగర్ ప్రింట్స్ లిఫ్టింగ్ అండ్ ప్యాకింగ్, బాంబ్ డిస్పోజల్, డాగ్ స్క్వాడ్,ప్రోపెషన్ ఫోటో మరియు వీడియోగ్రాఫీల్లో విభాగాల్లో పోటీపడ్డారు. ఇందులో ప్రతిభ కనబరిచన పోలీస్ అధికారులకు వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ అధికారుల చేతుల మీదుగా పతాకాలను అందజేసారు. ఇందులో వరంగల్ పోలీస్ కమిషనరేట్ విభాగానికి 13 గోల్డ్ మెడల్స్ సహా మొత్తం28 పతకాలను సాధించారు. అలాగే భద్రాద్రి కొత్తగూడెం 12, మహబూబాబాద్ జిల్లాకు 13 , ఖమ్మం 9 పతకాలను సాధించారు. ఇందులో రాణించిన పోలీస్ అధికారులు త్వరలో మల్కాజిగిరి కమిషనరేట్‌లో జరగబోయే రాష్ట్రస్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌లో పాల్గొంటారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ఇలాంటి డ్యూటీ మీట్‌ల ద్వారా వృత్తి నైపుణ్యాన్ని సాధించవచ్చని, కఠోర సాధన చేస్తే కేవలం వృత్తి నైపుణ్యంతో పాటు అన్ని రంగాల్లో




ప్రతిభ కబరచవచ్చని. ముఖ్యంగా వృత్తి నైపుణ్యం సాధించడం ద్వారా విధి నిర్వహణలో ఎదురయ్యే పని ఒత్తిళ్ళ అదిగమించవచ్చని, జోనల్ స్థాయిలో కబరిచిన ప్రతిభనే రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచాలని పోలీస్ కమిషనర్ అధికారులకు సూచించారు. విజయవంతంగా ఈ పోటీలను ముగించడంలో కృషి చేసిన పోలీస్ అధికారులు, సిబ్బందిని పోలీస్ కమిషనర్ అభినందనలు తెలియజేసారు. ఈ పోటీలను ఈ కార్యక్రమములో, అదనపు డిసిపిలు శ్రీనివాస్, బాలస్వామి, ఏసిపిలు, సురేంద్ర , డి. ఎస్పీలు శ్రీనివాస్ , సాంబరాజు, ఆర్.ఐలు సతీష్ , ఇన్స్పెక్టర్లు, క్రాంతి కుమార్ఎ, విశ్వేశ్వర్ఐ, ఎస్ . ఐ విజయ్ కుమార్ , ఆర్.ఎస్.ఐ శ్రవణ్ కుమార్ ఇతర పోలీస్ సిబ్బంది పాల్గోన్నారు.

## నూతన ప్రెస్ క్లబ్ కమిటీని సన్మానించిన ఎమ్మెల్యే



**నడి కూడ జులై 9 (జనం సాక్షి) :** ఇటీవల నూతనంగా నడికుడ మండల ప్రెస్ క్లబ్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది నూతనంగా గెలుపొందిన ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నారా గాని రమేష్ ప్రధాన కార్యదర్శి భాస్కరరావు కోశాధికారి జమాలుద్దీన్ మరియు కార్యవర్గ సభ్యులు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు నూతనంగా గెలుపొందిన అధ్యక్ష కార్యదర్శి కోశాధికారులను ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి శాలువాతో ఘనంగా సన్మానించి నూతనంగా ఎన్నుకోబడిన ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులు జర్నలిస్టుల సంక్షేమానికి ఎంతో కృషి చేయాలని అన్నారు అదేవిధంగా వరంగల్ కూడా చైర్మన్ ఇనగాల వెంకటరామిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలవగా నూతన ప్రెస్ క్లబ్ కమిటీని ఘనంగా సన్మానించారు అనంతరం పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిని ప్రెస్ క్లబ్ కమిటీ మర్యాదపూర్వకంగా కలవగా నూతన కమిటీని ఘనంగా సన్మానించారు రాష్ట్ర రైతు విమోచన కమిషన్ మాజీ చైర్మన్ ఫర్టిలైజర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నాగూర్ల వెంకన్నను మర్యాదపూర్వకంగా కమిటీ సభ్యులు కలవగా వారిని శాలువాలతో ఘనంగా సన్మానించారు నూతన మండలం ఏర్పడిన తర్వాత మొదటగా నూతన ప్రెస్ క్లబ్ ఏర్పడడం చాలా సంతోషకరంగా ఉందని ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉంటూ ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని పలువురు ప్రెస్ క్లబ్ కమిటీకి అభినందనలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ప్రెస్ క్లబ్ గౌరవాధ్యక్షులు గడ్డం బాలరాజు కమిటీ ఉపాధ్యక్షులు విజయ్ ముక్కెర చిరంజీవి సంయుక్త కార్యదర్శులు బైరి సుధీర్ బొమ్మ అశోక్ కార్యవర్గ సభ్యులు రాజేందర్ రజినీకాంత్ రవి సతీష్ మరియు జర్నలిస్టు మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

## బోగస్ ఓట్ల తొలగింపునకు ఎస్ఐఆర్ మంచి అవకాశం

### ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్



**భైంసా, జూలై 9 ( జనం సాక్షి):** ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ బోగస్ ఓట్ల తొలగింపునకు మంచి అవకాశమని ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. భైంసాలో నిర్వహించిన బీజేపీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరూ ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగస్వాములై అర్హులైన ఓటర్ల పేర్లను నమోదు చేయించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ప్రక్రియ ద్వారా బోగస్ ఓట్లను తొలగించడంతో పాటు ఓటరు జాబితాలను మరింత పారదర్శకంగా రూపొందించేందుకుఅవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అలాగే, విదేశీయుల చొరబాట్లను అరికట్టడంలో కూడాఎస్ఐఆర్ ప్రక్రియ దోహదపడుతుందనిఆయన అభిప్రాయపడ్డారు. బీజేపీ కార్యకర్తలు బూత్ లెవల్ అధికారులకు (బీఎల్‌వోలు) సహకరించి, అర్హులైన ఒక్క ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకుండా చూడాలని ఆయన సూచించారు.

## అడవాలపల్లిలో గుడిసెల గుర్తింపు సర్వే

### ఎంపీడీఓ క్రాంతి కుమార్

**మల్హర్, జూలై 9(జనంసాక్షి)** తెలంగాణను గుడిసెలు లేని రాష్ట్రంగా మార్చాలనే ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని అ డవాలపల్లి గ్రామంలో గుడిసెల గుర్తింపు సర్వే నిర్వహించారు. గురువారం ఎంపీడీఓ క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో అధికారులు గ్రామంలోని ప్రతి ఇంటిని, గుడిసెలను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చేలా ఈ సర్వే చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ఎంపీవో మల్లికార్జున్, పంచాయతీ కార్యదర్శి సరస్వతి, సర్పంచ్ అజ్మీరా సారక్క, ఉపసర్పంచి రాజేందర్, టిఆర్ఎస్ జిల్లా నాయకులు అజ్మీరా బాలాజీ నాయక్, సమ్మయ్య నాయక్గ్రామస్థులు పాల్గొన్నారు.

## నూతన ఎంఈఓ రాజు నాయక్‌కి సన్మానం

**లక్ష్మణ చందా, జులై 9 (జనం సాక్షి)** లక్ష్మణ చందా మండల నూతన మండల విద్యాధికారి (ఎంఈఓ)గా బాధ్యతలు స్వీకరించిన రాజునాయక్‌ని పాఠశాల ఉపాధ్యాయులు,సిబ్బందిఘనంగాసన్మానించారు. ఈసందర్భంగా పూలమాలలు వేసి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో విద్యాభివృద్ధికి తమ వంతుసహకారం అందిస్తామని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. రాజునాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యను మరింత బలోపేతం చేసేందుకు ఉపాధ్యాయులందరి సహకారంతో కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుల ఉపాధ్యాయులు, పెంటఅశోక్,వర్మ, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ రూ. 1లక్ష 12 వేల 500 చెక్కుల పంపిణీ...

### జల్లి కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు బాదావత్ బాలు నాయక్



**చెన్నారావుపేట, జులై 9 ( జనం సాక్షి):** మండలంలోని జల్లి గ్రామంలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు గురువారం కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు బాదావత్ బాలు నాయక్ బాధిత కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఇట్టబోయిన నర్సయ్యకు రూ. 11వేల 500, దేశెట్టి హరీశ్ కు రూ. 10 వేలు, మహమ్మద్ అక్బర్‌కు రూ. 48వేల 500, జరుపుల దేజ్యకు 32 వేలు, బిట్ల శ్రీలతకు రూ. 10వేల 500 చొప్పున మొత్తం 1లక్ష 12 వేల 500 రూపాయల చెక్కులను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జరుపుల మారి బిక్షం, అమీనాబాద్ సొసైటీ డైరెక్టర్ అంబాల రవి, కుర్ర వెంకటేశ్వర్లు, బిట్ల శ్రీనివాస్, మెండె విజేందర్, జక్క రవి, యాకుబ్ పాష, చీకటి రాజశేఖర్, అంబాల శ్రీను, జరుపుల ప్రవీణ్, బోడ కిషన్, వల్లాజి మహేందర్, రాధారపు కృష్ణ, యాకుబ్ పాష, కొర్ర శివ, విజయ్, బాదావత్ రాజు, షర్ఫోద్దిన్, కొంకాల భద్రస్వామి, దొడ్డ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## మొక్కల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



**నల్లబెల్లి, జూలై 09(జనంసాక్షి):** మొక్కల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని సర్పంచ్ ఓరుగంటి మాధురి రాజు అన్నారు. గురువారం మండలంలోని రంగాపురం గ్రామంలో మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని సర్పంచ్ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఇంటికి కనీసం ఒక్క మొక్కనైనా నాటి సంరక్షించాలని గ్రామ ప్రజలకు సూచించారు. పచ్చదనాన్ని పెంపొందించి భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణ, ప్లాస్టిక్ వాడడం వల్ల కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, అంగన్వాడి టీచర్లు, ఆశ వర్కర్లు, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామ నాయకులు, యువకులు పాల్గొన్నారు.

## కాసిపేట 1వ గనిని సందర్శించిన అధికారులు



**కాసిపేట జులై 9 ( జనం సాక్షి )** వందమర్రి ఏరియాలోని కాసిపేట1 ఇంక్లైన్ గనిని, డిజిఎంఎస్ అధికారులు సందర్శించి రికార్డు లను పరిశీలించారు. అంతకు ముందు డీఎంఎస్ (మైనింగ్) సాగేష్ కుమార్, డీడీఎంఎస్ (మైనింగ్) దీపక్ కుమార్‌లను జనరల్ మేనేజర్,రాధకృష్ణ, ఏజెంట్ అబ్దుల్ ఖాదీర్, మేనేజర్ సతీష్,అధికారులు స్వాగతం పలికి శాలువా,పూల బొకే తో వారిని సన్మానించిన ఏజెంట్ అబ్దుల్ ఖాదీర్,మేనేజర్ సతీష్, అధికారులు. రికార్డులు తనిఖీ చేసి గని పని స్థలాలను పరిశీలించారు. డీఎంఎస్ (మైనింగ్) సాగేష్ కుమార్, డీడీఎంఎస్ (మైనింగ్) దీపక్ కుమార్ నేతృత్వంలోని బృందంతో ఏరియా జీఎం రాధాకృష్ణ, బెల్లంపల్లి రీజియన్ జీఎం (సేఫ్టీ) రఘు కుమార్, కెకె గ్రూప్ ఏజెంట్ అబ్దుల్ ఖాదీర్, మేనేజర్ సతీష్,ఏరియా ఇంజనీర్ మాధవ్, రక్షణ అధి కారి సురేష్,డిప్యూటీ మేనేజర్ వెంకటేష్, ఇంజనీర్ శ్రీనివాస్,సర్వేయర్,ప్రభాకర్, రవీందర్,సంక్షేమ అధికారి మీర్జా గౌస్ జీషాన్, వర్క్ మెన్ ఇన్స్పెక్టర్స్ రంజిత్,అశోక్,గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎస్ఐబిజెయం పాఠశాలలో డిజిటల్ క్లాస్ రూమ్ ప్రారంభించిన మిషనరీ ఇంచార్జ్



**శాయంపేట, జూలై 9 (జనం సాక్షి)** సియస్ఐబిజెయం ఉన్నత పాఠశాల కాట్రపల్లిలో డిజిటల్ క్లాస్ రూమ్ ను మిషనరీ ఇంచార్జ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చుట్టూ ఉన్న గ్రామాల్లో ఉన్న పిల్లలు అందరు పేద పిల్లలే అని వారికి నాణ్యమైన విద్యను అందించడం కోసమే ఈ డిజిటల్ క్లాస్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగింది అని తెలిపారు. దీనిని పిల్లలు మంచిగా ఉపయోగించుకొని జ్ఞానాన్ని పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ అనిల్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ రాజు నాయక్, సెక్రటరీ రాజన్న, ఉపాధ్యాయులు ప్రవళిక, సామెల్, సత్యం, శైలజ, మౌనియ, శృతి, ఉమ, షారోన్, అతిర, సుహాసిని మరియు ఇతర ప్రాంతాలనుండి వచ్చిన సేవకులు తల్లితండ్రులు పాల్గొన్నారు.

## ఉప సర్పంచ్‌ల ఫోరం జిల్లా ఉపాధ్యక్షులుగా గడ్డం రాజు ఎన్నిక




**శాయంపేట, జూలై 9 (జనం సాక్షి)** ఉప సర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు బొట్ల కార్తీక్ ఆధ్వర్యంలో ఉప సర్పంచ్ల ఫోరం హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షులుగా గడ్డం రాజును ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. గడ్డం రాజు మండలంలోని రాజు పల్లి గ్రామ ఉప సర్పంచ్ గా కొనసాగుతున్నారు. జిల్లా ఉపాధ్యక్షులుగా ఎన్నిక కాబడిన రాజును రాజు పల్లి గ్రామ సర్పంచ్ మలసాని లక్ష్మణరావు, నాయకులు గజ్జెల రాజు, సిద్దూరి మధుకర్ రావు మలసాని తిరుపతిరావు గడ్డం రమేష్ వార్డు మెంబర్లు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ఎన్నికకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. ఉప సర్పంచ్‌ల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు.

## బీజేపీ బూత్ కమిటీలను పటిష్టం చేయాలి

### గూడూరు మండల ఇంచార్జి పొదిల్ల నరసింహారెడ్డి



గూడూరు,జులై09(జనంసాక్షి ): గూడూరు మండలంలో బీజేపీ బూత్ కమిటీలను పటిష్టం చేయాలనీ గూడూరు మండల ఇంచార్జి పొదిల్ల నరసింహారెడ్డి నాయకులకు పిలుపునిచ్చారు. గురువారం గూడూరు మండల కేంద్రంలో బీజేపీ ముఖ్య నాయకుల సమావేశం మండల అధ్యక్షులు రాసమల్ల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగినది. ఈసమావేశానికి గూడూరు మండల ఇంచార్జి పొదిల్ల నరసింహారెడ్డి హాజరై మాట్లాడారు. గూడూరు మండలంలో బీజేపీ బూత్ కమిటీలను పటిష్టం చేసే విధంగా సీనియర్ నాయకులు చొరవ తీసుకోవాలని అన్నారు. అదేవిదంగా సర్ ప్రక్రియను విధిగా నిర్వహించి,అర్హులైన ఓటర్లను గుర్తించి జాబితాలో నమోదు చేయాలనీ బిఎల్ఏ-2 లను కోరారు. ఈసమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు మేరెడ్డి సురేందర్,జిల్లా కౌన్సిల్ మెంబర్ మెరుగు మల్లయ్య, సీనియర్ నాయకులు చెల్పూరి శ్రీశైలం,గుండెబోయిన మల్లేష్ యాదవ్,వార్డ్ సభ్యులు వాంకుడోత్ మైబు శ్రీనివాస్,వినోద సురేష్, ప్రధాన కార్యదర్శి నల్లగొండ అనిల్,బాలు నాయక్, ముత్యం సురేష్,బూత్ అధ్యక్షులు బల్సుకూరి సంపత్, తదితరులు పాల్గొన్నారు.

## సొసైటీ చైర్మన్ మొగిలి వెంకట్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన సర్పంచ్



**చెన్నారావుపేట, జూలై 9 ( జనం సాక్షి):** అమీనాబాద్ సొసైటీ చైర్మన్‌గా ఇటీవల నూతనంగా నియామకమైన మొగిలి వెంకట్ రెడ్డిని అమృతండా గ్రామ సర్పంచ్ బోడ వీరాసింగ్, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు బానోత్ వెంకన్నలు మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం పాపయ్యపేట గ్రామంలోని తన నివాసంలో స్థానిక కాంగ్రెస్ నాయకులుతో కలిసి నూతనంగా ఎన్నికైన సొసైటీ చైర్మన్ మొగిలి వెంకటరెడ్డిని కలిసి పూల బొకే అందించి శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సొసైటీ డైరెక్టర్ మజ్జిగ రాంబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ బోడ ధన్ సింగ్, ఉపాధ్యక్షులు నునావత్ నర్సు, బోడ పంతులు, వార్డ్ మెంబర్స్ బోడ సంతోష్, బోడ స్వరూప ప్రవీణ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు బోడ కృష్ణ, బోడ రవి, భూక్య యాకూబ్, భూక్య బాలు, బోడ రాజు, భూక్య తారా సింగ్, నునావత్ రాజు, బోడ శ్రీనివాస్, భానోత్ వీరా సింగ్, గోడ మీటియా, బానోతు రెడ్డి, భాను, సంధ్య, బోడ పంతులు, పాల్గొన్నారు.

# ముస్మి గ్రామంలో అక్రమ టేకు స్వాధీనం

**ఎఫ్ ఆర్ ఓ వంశీకృష్ణ**



**కొత్తగూడ, జూలై 9 జనంసాక్షి :** మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం ముస్మి గ్రామంలో అటవీ శాఖ అధికారులు మెరుపు దాడులు నిర్వహించి, ఓ ఇంటి నుంచి సుమారు 68 అక్రమ టేకు దుంగలను స్వాధీనం చేసుకున్నారు. గూడూరు ఎఫ్‌డిఓ , కొత్తగూడ ఎఫ్ ఆర్ ఓ వంశీకృష్ణ ఆధ్వర్యంలో సిబ్బంది ఈ తనిఖీలు చేపట్టారు. స్వాధీనం చేసుకున్న కలపను రేంజ్ కార్యాలయానికి తరలించి, చట్టపరమైన చర్యలు ప్రారంభించారు. మరికొన్ని ఇళ్లలోనూ తనిఖీలు కొనసాగుతున్నాయని అటవీ సంపదను కాపాడేందుకు అక్రమ రవాణా, నిల్వలపై ప్రత్యేక నిఘా ఉంటుందని, ప్రజలు సమాచారం అందించి సహకరించాలని ఎఫ్ ఆర్ ఓ వంశీకృష్ణ విజ్ఞప్తి చేశారు.

# అభివృద్ధిలో సేవా కార్యక్రమాల్లో అక్కకు అక్కే సాటి

**బైరి అభిలాష్ యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు**



**గోవిందరావుపేట. జులై. (జనం సాక్షి). 09.07.26.** మంత్రి సీతక్క జన్మదినాన్ని పురస్కరించుకుని గిరిజన గూడాల్లో సేవా కార్యక్రమాలు. అభివృద్ధిలో సేవా కార్యక్రమాల్లో అక్కకు అక్కే సాటి అని మరెవ్వరు పోటీ కాదని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బైరి అభిలాష్ అన్నారు. గురువారం మంత్రి సీతక్క జన్మదినం సందర్భంగా అభిలాష్ ఆధ్వర్యంలో లవ్వాల స్టేజి, జరగాలంచ గుత్తి కోయ గ్రామాల్లో మిఠాయిలు బిస్కెట్ ప్యాకెట్లు స్వీట్లు అరటి పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అభిలాష్ మాట్లాడుతూ మంత్రి సీతక్క ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని, అక్క సేవలు ప్రజలకు మరింత చేరువయ్యేలా కృషి చేస్తామని అన్నారు. అక్క జీవితకాలం ఆరోగ్యంగా ఉండి ప్రజాసేవలో గడపాలని జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించాలని దేవు ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రధానంగా గిరిజన ప్రాంతాల అభ్యున్నతికి అక్క చేస్తున్న కృషిని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల యూత్ కాంగ్రెస్ నాయకులు, పసర గ్రామ కమిటీ యూత్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# చెన్నారావుపేటలో వరుస చోరీలు

- నగదు, సెల్‌ఫోన్ అపహరణ.. పాన్‌షాపులో విఫలయత్నం
- రాత్రివేళ గస్తీ పెంచాలని చిరు వ్యాపారులు, గ్రామస్తుల వినతి





చెన్నారావుపేట, జూలై 9 (జనం సాక్షి): చెన్నారావుపేట మండల కేంద్రంలో బుధవారం రాత్రి చోరీ ఘటన చోటుచేసుకుంది. చెన్నారావుపేట-నెక్కొండ ప్రధాన రహదారి పక్కన కూరగాయల వ్యాపారం చేసుకునే వైనాల కోమల రాత్రి షాపులోనే నిద్రించగా, గుర్తుతెలియని వ్యక్తి షాపులోకి చొరబడి పక్కనే ఉన్న సెల్‌ఫోన్‌తో పాటు గల్లా పెట్టెలోని రూ.3 వేల నగదును అపహరించుకుపోయాడు. అదే రోడ్డుపై పాన్‌షాపు నిర్వహిస్తున్న మహమ్మద్ అబ్దుల్ గఫార్ బుధవారం రాత్రి షాపునకు తాళం వేసి ఇంటికి వెళ్లగా, అర్ధరాత్రి సమయంలో దుండగులు గడ్డపారతో తాళాలు పగులగొట్టి చోరీకి విఫలయత్నం చేశారు. గురువారం ఉదయం షాపు తాళాలు పగలగొట్టి ఉండటాన్ని గమనించిన బాధితుడు పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. ఇటీవల జూన్ 19న మహమ్మద్ వసీం పాన్‌షాపులో గడ్డపారతో గల్లా పెట్టె పగులగొట్టి రూ.5 వేలు, జూలై 8న సురేందర్ రెడ్డి ఆసుపత్రిలోని మెడికల్ షాపులో రూ.6 వేల నగదు, రూ.10 వేల విలువైన మందులు అపహరణకు గురయ్యాయి. ఈనెల 4న నంబర్ వన్ కాలనీలో బొక్కల బుజ్జమ్మ, మట్టెవాడ మస్తాన్ ఇళ్లలో చోరీకి యత్నించిన సాదు రాజు అనే వ్యక్తిని కాలనీవాసులు పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. గతంలోనూ మాదాసి కుమార్ కిరాణా షాపులో ఇదే వ్యక్తి చోరీకి పాల్పడగా స్థానికులు పట్టుకున్నారు. వరుస దొంగతనాలతో ప్రధాన రహదారి పక్కన వ్యాపారాలు చేసుకునే చిరు వ్యాపారులు, గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. రాత్రివేళ పోలీసులు గస్తీ పెంచి నిందితులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని, దొంగతనాలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

# ఏఐటీయూసీ జిల్లా మహాసభల గోడప్రతుల ఆవిష్కరణ




**శ్రీరాంపూర్(జనంసాక్షి):** మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఆగస్టు 2వ తేదీన నిర్వహించనున్న ఏఐటీయూసీ జిల్లా మహాసభ గోడ ప్రతులను గురువారం శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 7 గనిపై ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీ సైదా,వైస్ ప్రెసిడెంట్ కొట్టే కిషన్‌రావు,అసిస్టెంట్ బ్రాంచ్ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య గోడప్రతుల ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ కార్మికుల హక్కుల పరిరక్షణ,పెండింగ్ సమస్యల పరిష్కారం,ఉద్యోగ భద్రత,సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలు,సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ నిరంతరం పోరాడుతుందని పేర్కొన్నారు. జిల్లా మహాసభల్లో కార్మికుల సమస్యలతో పాటు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌పై సమగ్ర చర్చ జరగనున్నదని తెలిపారు. దశాబ్దాల పోరాటాల ద్వారా కార్మికులు సాధించుకున్ హక్కులను నిర్వీర్యం చేసే ప్రమాదకర చర్యలుగానే ఈ నాలుగు లేబర్ కోడ్స్‌ను వారు అభివర్ణించారు. కార్మిక చట్టాలను యాజమాన్యాలకు అనుకూలంగా మార్చడం,ఉద్యోగ భద్రతను బలహీనపరచడం,పని గంటలను పెంచే అవకాశాలు కల్పించడం,కార్మిక సంఘాల హక్కులను పరిమితం చేయడం,కాంట్రాక్టు విధానాన్ని మరింత ప్రోత్సహించడం వంటి చర్యలు పూర్తిగా కార్మిక వ్యతిరేకమని విమర్శించారు. దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న నాలుగు లేబర్ కోడ్స్‌ను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల ప్రయోజనాలను దెబ్బతీసే ఎలాంటి విధానాలనైనా ఏఐటీయూసీ సంఘటిత పోరాటాలతో తిప్పికొడుతుందని స్పష్టం చేశారు. జిల్లా మహాసభలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హాజరుకానుండగా,ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు యూసఫ్,సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య,ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్‌తో పాటు కేంద్ర,జిల్లా, ఏరియా, బ్రాంచ్ స్థాయి నాయకులు పాల్గొని కార్మికులను ఉద్దేశించి ప్రసంగించనున్నట్లు తెలిపారు. మహాసభల విజయవంతానికి శ్రీరాంపూర్ ఏరియాలోని అన్ని గనులు,విభాగాల్లో విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఏఐటీయూసీ సభ్యులు,కార్యకర్తలు,కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై మహాసభలను చారిత్రాత్మక విజయంగా నిలపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జీఎం చర్చల ప్రతినిధులు బద్రి బుచ్చయ్య,బాలకృష్ణ,పిట్ సెక్రటరీ మారేపల్లి సారయ్య, మీడియా అధికార ప్రతినిధి రాజ్‌కుమార్,అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ సదానందం,వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్లు రమేష్ పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ కార్యాచరణను బూత్ స్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలి:పతంగే బ్రహ్మానంద్

**గుడిహత్నూర్ జూలై 9, (జనం సాక్షి)** ఎస్ఐఆర్ కార్యాచరణను పార్టీ మార్గదర్శకాల ప్రకారం ప్రతి బూత్ స్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని అదిలాబాద్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ నాయకులకు , కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గుడిహత్నూర్‌లో నిర్వహించిన ఎస్ఐఆర్ కోర్ కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి కార్యకర్త బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ప్రజలతో నిరంతర సంబంధాలు కొనసాగించాలని, పార్టీ బలోపేతానికి సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. బూత్ కమిటీలను మరింత చురుకుగా పనిచేసేలా కార్యాచరణ రూపొందించాలని, పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయడంలో ప్రతి నాయకుడు తన వంతు బాధ్యతను నిర్వర్తించాలని అన్నారు. అలాగే ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించడంతో పాటు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ, మండల, బూత్ స్థాయి నాయకులు, కోర్ కమిటీ సభ్యులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్యకర్తలతో మాట్లాడుతున్న బిజెపి జిల్లా అధ్యక్షులు

# పాలకుర్తి బ్లాక్ “ఆత్మ” చైర్మన్ ఎర్రబెల్లి రాఘవరావు ఏకగ్రీవ ఎన్నిక

## ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన రాఘవరావు



**పాలకుర్తి, జూలై 09(జనంసాక్షి)** పాలకుర్తి బ్లాక్ ఆత్మ చైర్మన్‌గా (అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్మెంట్ ఏజెన్సీ) పాలకుర్తి మండలం విస్నూరు గ్రామానికి చెందిన ఎర్రబెల్లి రాఘవరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో 28 మంది సభ్యులతో సమావేశం జరుగగా సభ్యులందరు బ్లాక్ ఆత్మ చైర్మెన్ గా ఎర్రబెల్లి రాఘవరావును చైర్మన్ గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన రాఘవరావు స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డిని కలిసి పుష్పగుచ్చం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రాఘవరావు మాట్లాడుతూ తనకు ఆత్మ చైర్మన్ గా అవకాశం కల్పించిన ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీరెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రైతుల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన వ్యవసాయ సంక్షేమ పథకాలను గ్రామీణ స్థాయిలో సమర్థవంతంగా అమలు చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ. మండల అధ్యక్షుడు పోగు శ్రీనివాస్. నాయకులు ఎండి. మదర్. గాదపాక భాస్కర్. పన్నీరు వెంకన్న. మాదాసు హరీష్. తదితరులు ఉన్నారు.

# భూపాలపల్లి మండలంలో రూ.48 లక్షల అభివృద్ధి పనుల ప్రారంభం

- గ్రామీణాభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో. (జనంసాక్షి):** భూపాలపల్లి మండలంలో సుమారు రూ.48 లక్షల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు బుధవారం ప్రారంభించారు. పంబాపూర్‌లో రూ.9 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనం, గొల్లబుద్ధారంలో రూ.9 లక్షలతో నిర్మించిన అదనపు తరగతి గదులు, శ్యామ్‌నగర్‌లో రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, మొరంచపల్లి గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ గ్రామాల్లో రవాణా సౌకర్యాల మెరుగుదలతో పాటు రైతులు తమ పొలాలకు సులభంగా చేరుకునేలా నాణ్యమైన రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గ్రామాల అభివృద్ధి, పరిశుభ్రతే రాష్ట్ర అభివృద్ధికి పునాదులని పేర్కొంటూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను పారదర్శకంగా, నాణ్యతతో అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రతి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, సంబంధిత శాఖల అధికారులు, జిల్లా అధికారులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# భూముల రీ సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

## వరంగల్ జిల్లా సర్వే ఏడి శ్రీనివాసులు



**చెన్నారావుపేట, జూలై 9 ( జనం సాక్షి):** భూముల రీ సర్వేకు గ్రామాల్లోని రైతులు ప్రతి ఒక్కరు సహకరించాలని వరంగల్ జిల్లా సర్వే ఏడి శ్రీనివాసులు అన్నారు. గురువారం మండలంలోని తిమ్మరాయిని పహాడ్ గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వే పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భూముల రీ సర్వేను ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టుగా మండలంలోని తిమ్మరాయిని పహాడ్, జల్లి, అక్కల్ చెడ, లింగాపురం, కోనాపురం గ్రామాలను ఎంపిక చేసిందన్నారు. గ్రామాలలో రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించడానికి భూముల రీ సర్వే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామాలలోని రైతులు ప్రతి ఒక్కరూ భూముల రీ సర్వేకు వచ్చే అధికారులు, సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు. అలాగే భూముల రీ సర్వేకు సంబంధించిన అంశాలపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ మహమ్మద్ ఆబిద్ అలీ, గ్రామ సర్పంచ్ ధారావత్ రమేష్, గిర్దావర్ మమత, జూనియర్ అసిస్టెంట్ మహమ్మద్ అంజద్ ఖాన్, పంచాయతీ కార్యదర్శి కాసుల రాంబాబు, వార్డు సభ్యులు, రైతులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# మీసేవ కేంద్రాల్లో యూరియా బుకింగ్..

## రూ.10 సేవా రుసుముతో ముందస్తు బుకింగ్ సదుపాయం: డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీకాంత్.



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** రైతులకు అవసరమైన యూరియా ఎరువులను నకాలంలో అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మీ సేవా కేంద్రాల ద్వారా యూరియా బుకింగ్ సేవలను అందుబాటులోకి తీసు కొచ్చినట్లు ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీకాంత్ తెలిపారు. రైతులు తమ సమీప మీ సేవా కేంద్రాలలో ముందస్తుగా యూరియాను బుక్ చేసుకోవాలని సూచించారు. యూరియా బుకింగ్ కోసం పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్, రిజిస్టర్డ్ మొబైల్ నంబర్ వివరాలు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. యూరియా బుకింగ్ పూర్తి అయ్యాక ఐడీతో కూడిన రసీదు అందజేస్తారని ఆయన తెలిపారు. పోడు పట్టాలు కలిగిన రైతులు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన రూ.10 సేవా రుసుము చెల్లించి బుకింగ్ చేసుకోవాలని ఆయన సూచించారు. మొబైల్ నంబర్ మార్పు, కౌలు రైతుల నమోదు కోసం సంబంధిత రైతు వేదికలోని వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించాలని తెలిపారు. డిజిటల్ సంతకం పూర్తికాని భూముల పట్టాదారులు కూడా ఆధార్ ఆధారంగా యూరియా బుకింగ్ చేసుకునే అవకాశం కల్పించినట్లు ఆయన స్పష్టం చేశారు.

# ఆశ్రమ పాఠశాలను సందర్శించిన ఎంపీడీవో



**సారంగాపూర్,జూన్9( జనం సాక్షి)** సారంగాపూర్ మండలం స్వర్ణ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను గురువారం ఎంపీడీవో లక్ష్మీ కాంతారావు ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో ముఖాముఖి అయ్యారు. వారి చదువుల కోసం ఆరా తీశారు. అనంతరం పాఠశాల స్టాక్ రిజిస్టర్, విద్యార్థుల హాజరును పరిశీలించారు .మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి శైలజ, డి వై హెచ్ డబ్ల్యు ఓ రాథోడ్ మాంగిలాల్ సిబ్బంది ఉన్నారు.

# సీతక్క నిండు నూరేళ్లు ప్రజల సేవలో ఉండాలి

## భూక్య సుమలత సర్పంచ్ పసర గ్రామపంచాయతీ



**గోవిందరావుపేట. జులై.( జనం సాక్షి ).09.07.26** మంత్రి సీతక్క నిండు నూరేళ్లు చల్లగా ఉండి ప్రజల సేవలో ఉండాలని పసర నాగారం పంచాయతీ సర్పంచ్ భూక్యాసుమలత అన్నారు. గురువారం మండలంలోని పసర గ్రామంలో తన నివాస గహంలో మంత్రి సీతక్క జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంత్రి సీతక్క పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్స్ పంచుకున్నారు. అనంతరం సుమలత మాట్లాడుతూ మంత్రి సీతక్క నిరంతరం ప్రజల కొరకు ప్రజాసేవలో శ్రమిస్తున్న మహోన్నతమైన వ్యక్తి సీతక్క అని అన్నారు. సీతక్క హయాంలో అంతులేని అభివృద్ధిని చూస్తున్నామని అన్నారు. ప్రజల అందరి దీవెనలతో ఆశీస్సులతో జీవితకాలం అక్క ప్రజా సేవలో ఉండాలని ఇంకా ఎంతో ఎదగాలని కోరుకుంటున్నామని అన్నారు.

# ఘనంగా మంత్రి సీతక్క జన్మదిన వేడుకలు



**మంగపేట, జూలై 9(జనంసాక్షి)** రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) పుట్టినరోజు వేడుకలను మంగపేట మండల కేంద్రంలో వైయస్సార్ సెంటర్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు చెట్టుపల్లి వెంకటేశ్వర్లు పాల్గొని, కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు.ఈ సందర్భంగా చెట్టుపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ…అడవిలో మొదలైన మీ ప్రయాణం నేడు ప్రజా హృదయాలను గెలుచుకున్న ఒక చరిత్రగా నిలిచింది. ధైర్యం మీ ఆభరణం, ప్రజాసేవ మీ ప్రాణం అని పేదరికంలో పుట్టి, నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలోనే కీలక మంత్రిగా బాధ్యతలు చేపట్టి, మహిళలకు భరోసా కల్పిస్తూ, గ్రామాల అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారు అని కొనియాడారు. మంత్రి సీతక్క సాధించిన విజయం కేవలం ఒక పదవి మాత్రమే కాదని, ప్రజల హృదయాల్లో చెరగని సంతకమని ఆయన పేర్కొన్నారు. ఆమె నడిచిన దారి వేలాది మంది మహిళలకు ఆత్మవిశ్వాసాన్ని నింపుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యానయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి మాసిరెడ్డి వెంకటరెడ్డి, సీనియర్ నాయకులు తూడి భగవాన్ రెడ్డి, పూజారి సురేందర్, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ మెంబర్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ పునర్నిర్మాణమే ఏబీవీపీ ధ్యేయం: బోడ లక్ష్మణ్



**నిర్మల్ టౌన్ , జూలై 09, (జనంసాక్షి)** దేశ నిర్మాణంలో విద్యార్థుల పాత్ర కీలకమని, జాతీయ పునర్నిర్మాణమే అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ధ్యేయమని ఆ సంస్థ జాతీయ కార్యవర్గ సభ్యుడు బోడ లక్ష్మణ్ అన్నారు. జాతీయ విద్యార్థి దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఏబీవీపీ నిర్మల్ నగర శాఖ ఆధ్వర్యంలో స్థానిక వివేకానంద విగ్రహం వద్ద జెండా ఆవిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఐదుగురు విద్యార్థులతో ప్రారంభమైన ఏబీవీపీ నేడు దేశవ్యాప్తంగా 78 లక్షలకుపైగా సభ్యత్వంతో ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంఘంగా ఎదిగిందన్నారు. దేశ సమగ్రత, జాతీయవాదం, విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించేందుకు ఏబీవీపీ నిరంతరం కృషి చేస్తోందని చెప్పారు. దేశ ప్రయోజనాల కోసం అనేక ఉద్యమాలు చేపట్టి, పలువురు కార్యకర్తలు ప్రాణత్యాగాలు చేశారని గుర్తు చేశారు. భారతదేశాన్ని విశ్వగురువుగా తీర్చిదిద్దే ప్రయాణంలో ప్రతి విద్యార్థి భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ దినేష్, నితీష్, వంశీ, అభి, సాయిచరణ్, కార్తీక్, మణి తదితరులు పాల్గొన్నారు.

# టేకుమట్ల మండల సర్పంచుల ఫోరం అధ్యక్షునిగా కుర్రే మల్లయ్య యాదవ్



**టేకుమట్ల జులై 09 జనంసాక్షి** టేకుమట్ల మండల సర్పంచ్‌ల అందరి అధ్యక్షతన అందరు కలిసి సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షుడిగా ఆరేపల్లి గ్రామ సర్పంచ్ కుర్రే మల్లయ్య ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయా గ్రామాల సర్పంచులు తెలిపారు ఉపాధ్యక్షులు గా టేకుమట్ల సర్పంచ్ మాట్ల శ్రీనివాస్ గౌరవాధ్యక్షుల రాపూర్వ సర్పంచ్ అంబాల కిరణ్ కుమార్ లను ఎన్నుకున్నట్లు ఆయా గ్రామాల సర్పంచులు తెలియజేశారు ఈ సందర్భంగా నూతనంగా సర్పంచ్ల ఫోరం అధ్యక్షుని గా ఎన్నికైన కుర్రే మల్లయ్య మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి సర్పంచుల ఫోరం అధ్యక్ష పదవి ఇచ్చినందుకు మండలంలోని సర్పంచ్ లందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని ఆయన అన్నారు సర్పంచులకు ఎలాంటి సమస్యలు పెట్టిన తక్షణమే స్పందించి వారి సమస్యలు పరిష్కరిస్తానని ఆయన తెలియజేశారు ఈ కార్యక్రమంలో వెల్లంపల్లి సర్పంచ్ కూర వెంకట రాజిరెడ్డి పంగిడిపల్లి సర్పంచ్ గంధం సారయ్య సుబ్బక్క పల్లి సర్పంచ్ బొడ్డు రాజేందర్ గునిగంటి రజిని మహేందర్ పచ్చిక దిలీప్ రెడ్డి జక్కుల కుమార్ పొన్నం సాంబయ్య మారం రచన శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు

# " శ్రీమాతా" జ్యువెలరీ షాప్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**పాలకుర్తి జులై 09 (జనంసాక్షి)** మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన "శ్రీమాతా" జ్యువెలరీ షాప్‌ను పాలకుర్తి శాసనసభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా షాప్ యజమానులకు ఎమ్మెల్యే యశస్విని రెడ్డి శుభాకాంక్షలు తెలియజేస్తూ, వ్యాపార రంగంలో మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే ఇటువంటి వ్యాపార సంస్థలు మరిన్ని ఏర్పాటవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, వ్యాపారవేత్తలు, అభిమానులు మరియు పలువురు ప్రజలు పాల్గొన్నారు.

# ఏరియా స్థాయి సింగరేణి త్రైపాక్షిక భద్రతా సమీక్షా సమావేశం




**శ్రీరాంపూర్(జనంసాక్షి):** ఏరియా స్థాయి 24వ సింగరేణి వార్షిక త్రైపాక్షిక భద్రతా సమీక్షా సమావేశం ఏరియా సేఫ్టీ విభాగం ఆధ్వర్యంలో జీఎం శ్రీనివాస్ పర్యవేక్షణలో గురువారం సింగరేణి గెస్ట్ హౌజ్ కాన్ఫరెన్స్ హాల్ లో నిర్వహించారు. సింగరేణి డైరెక్టర్ పీపీ వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా,మైనింగ్ డీఎంఎస్ సాగేష్ కుమార్,డీడీఎంఎస్ లు దీపక్ కుమార్, ప్రభాకర్,కోమల్ చౌదరిలు పాల్గొనగా జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభించి సింగరేణి గీతం,డీజీఎంఎస్ గీతం ప్రదర్శించిన అనంతరం రక్షణ ప్రతిజ్ఞ నిర్వహించారు.గని ప్రమాదాలలో మృతిచెందిన కార్మికుల సంతాప సూచకంగా రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు. డైరెక్టర్ పీపీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా రక్షణకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు,క్షేత్రస్థాయిలో ఉద్యోగులకు రక్షణ అవగాహన కార్యక్రమాలు నిరంతర ప్రక్రియగా కొనసాగుతోంది అన్నారు.అవర్ ఏం జీరో హామ్ నినాదం లక్ష్య సాధన దిశగా నిరంతరం కృషిచేస్తున్నాం అని తెలిపారు.రక్షణకు శ్రీరాంపూర్ ఏరియాలో పెద్దపీట వేస్తున్నాం అని,రక్షణపై నిత్యం అవగాహన కార్యక్రమాలు నిర్వహించటమే కాదు ఎస్ఓపీ,సీఓపీలు చదివించి రక్షణ సూత్రలపై అవగాహన కల్పించన తరువాతనే పనులు ప్రారంభించటం ఏరియాలో ఒక నిరంతర ప్రక్రియలా కొనసాగిస్తున్నాం అని,రక్షణ చర్యలు చేపట్టడమే కాదు క్షేత్రస్థాయిలో వర్క్మెన్ ఇన్స్పెక్టర్లు,సూపర్వైజర్లు క్షేత్రస్థాయిలో ముందుగానే ప్రమాద పరిస్థితులు గుర్తించి వాటి నివారణకు కృషిచేసేలా వారికి సైతం అవగాహన కల్పిస్తున్నట్లు ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ తెలిపారు.సమావేశంలో జిఎం సేఫ్టీ కార్పొరేట్కె.సాయిబాబు,బెల్లంపల్లి రీజియన్ జీఎం సేఫ్టీ రఘు కుమార్,రెస్క్యూ ఆర్జీ 2 ఏరియా జిఎం శ్రీనివాస్ రెడ్డి,గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా,సిఎంఓఏఐ శ్రీరాంపూర్ అధ్యక్షులు లక్కాకుల మహేష్ పాల్గొన్నారు.

# 'హాకా' రైతు సేవా కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**పాలకుర్తి/ దేవరుప్పుల జులై 09 (జనంసాక్షి)** దేవరుప్పుల మండలం దారవత్ తండా సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన " రైతు సేవా కేంద్రాన్ని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, వ్యవసాయ సలహాలు ఒకే చోట అందుబాటులో ఉండేలా రైతు సేవా కేంద్రాలు పనిచేయడం అభినందనీయమని అన్నారు. రైతులు శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను అనుసరిస్తూ అధిక దిగుబడులు సాధించాలని ఆకాంక్షించారు.రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతుల అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని ఆమె పేర్కొన్నారు. హాకా రైతు సేవా కేంద్రం నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, రైతులకు నాణ్యమైన సేవలు అందించి వారి విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు థావేర అనిల్ కుమార్, మాజీ అధ్యక్షుడు నల్ల శ్రీరామ్, సీనియర్ నాయకులు ధర్మారెడ్డి, రెడ్డిరాజుల రమేష్, సజ్జన్ నాయక్, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు, వ్యవసాయ అధికారులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేయాలి

## కాజీపేటలో ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్





**కాజీపేట జూలై 7: (జనం సాక్షి)** ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా, సమయపాలనతో పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి చాహత్ బాజ్ పాయ్ బూత్ స్థాయి అధికారులను ఆదేశించారు. మంగళవారం రోజున కాజీపేట పట్టణంలోని డీజిల్ కాలనీ, విద్యానగర్ తదితర ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించిన జిల్లా కలెక్టర్, వార్డుల వారీగా ఓటర్లకు పంపిణీ చేసిన ఎన్యూమరేషన్ ఫారాలు, కుటుంబ సభ్యుల వివరాల నమోదు, నింపిన ఫారాల సేకరణ, డిజిటలీకరణ ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. ఇంటింటికి వెళ్లి ఓటర్లతో మాట్లాడి ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, వివరాల నమోదుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..., ప్రతి అర్హ ఓటరికి ఎన్యూమరేషన్ ఫారం అందేలా చర్యలు చేపట్టాలని, నింపిన ఫారాలను సకాలంలో సేకరించి ఎన్నికల సంఘం నిర్దేశించిన యాప్‌లో ఎలాంటి పొరపాట్లు లేకుండా వివరాలను నమోదు చేయాలని సూచించారు. ఓటర్ల వివరాల నమోదు సమయంలో పూర్తి ఖచ్చితత్వం పాటించాలని, ప్రజలకు అవసరమైన అవగాహన కల్పిస్తూ వారి సందేహాలను నివృత్తి చేయాలని బూత్ స్థాయి అధికారులకు సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పరిశీలన జరిపి ఎటువంటి లోపాలు లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఫారాలు నింపే క్రమంలో నిరక్షరాస్యులు ఉన్నట్లయితే బి ఎల్ ఓ బాధ్యత తీసుకుని సరైన సమాచారాన్ని ఓటర్ల నుండి తీసుకుని ఫారాలను పూర్తి చేసి అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పూర్తి చేసి డిజిటలీకరణను వేగవంతం చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని, ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఈ పరిశీలనలో కాజీపేట తహసీల్దార్ రాజు, బూత్ స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాలల సమస్యల పరిష్కారానికి కృషి ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి

**నెక్కొండ, జూలై 9 (జన సాక్షి):** నెక్కొండ మండల కేంద్రంలో పిఆర్ టి యు సభ్యత్వ నమోదు లో భాగంగా నెక్కొండ మండలంలోని తెలంగాణ గురుకుల పాఠశాల ఉపాధ్యాయులకు సభ్యత్వం ఇచ్చి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీ పింగిలి శ్రీపాల్ రెడ్డి, మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో నెలకొని ఉన్న సమస్యలలో భాగంగా పాఠశాలల్లోని డార్మెటరీలో వీధిలైట్ల ఏర్పాటు కోసం మరియు పాఠశాలలో అంతర్గతంగా సిసి రోడ్ల నిర్మాణానికి కృషి చేస్తానని గురుకులాల కామన్ టైం టేబుల్ సాధించామని గురుకుల సిబ్బందికి త్వరలో 010 విధానం అమలులోకి వస్తుందని అన్నారు. అలాగే హెల్త్ కార్డ్స్ ఇప్పించడానికి కూడా కృషి చేస్తామని అన్నారు, మంచి ఫిట్మెంట్ తో కూడిన పిఆర్సి ని త్వరలోనే ప్రభుత్వం ప్రకటించుటకు కృషి చేస్తానని, పెండింగ్లో ఉన్న డిమాండ్ల పరిష్కారానికి కూడా కృషి చేస్తానని మరియు ఉపాధ్యాయుల సమస్యల సాధనలో పి ఆర్ టి యు ముందుంటుందని అన్నారు, ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఈదునూరి రవీందర్ రెడ్డి, నకిరెడ్డి మహేందర్, హనుమకొండ జిల్లా అధ్యక్షులు మందల తిరుపతిరెడ్డి, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు కటకం రఘు, నెక్కొండ మండల అధ్యక్ష




ప్రధాన కార్యదర్శులు మాలోత్ ప్రతాప్ సింగ్, అంకం ప్రవీణ్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గురిజాల శ్రీధర్ రెడ్డి, రాపోలు యాకయ్య, కర్ర యాకూబ్ రెడ్డి, తంగేళ్లపల్లి రవీంద్రనాథ్, మరియు వడ్డే శ్రీనాథ్, రాష్ట్ర కార్యదర్శి రామారపు రవి, మరియు జిల్లా కార్యవర్గ సభ్యులు రావుల ప్రభాకర్, మండల కార్యవర్గ సభ్యులు ఐలయ్య, బిక్షపతి, వీరన్న, నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సీ.ఎం.ఆర్.ఎఫ్.చెక్ అందజేత




**వేలేరు జూలై: 9 (జనం సాక్షి)** వేలేరు మండల కేంద్రంలోని పేద కుటుంబలకు చెందిన వారు అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వేణు, శంకరయ్య, ఎల్లమ్మ, అనీల్, విషయం బిల్లా యాదగిరి, వేలేరు మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు సర్పంచ్ ,వేలేరు మేజర్ గ్రామ పంచాయితి దృష్టి కి రావడంతో, ఇట్టి విషయాన్ని కడియం శ్రీహరి కి తెలియజేయడం జరిగింది. వెంటనే స్పందించి, ముఖ్య మంత్రి సహాయ నిధి . సీఎంఆర్ఎఫ్ ద్వారా 125000/ఒక లక్ష ఇరువై ఐదు వెయ్యిలు రూపాయలు చేక్ లను వారి కుటుంబ సభ్యులకు వేలేరు మండల కేంద్రంలోని రైతు వేదిక నందు మాజీ ఉప ముఖ్యమంత్రి వర్యులు స్టేషన్ ఘనపూర్ కడియం శ్రీహరి అందజేశారు..

# ఘనంగా ఏబీవీపి 78వ ఆవిర్భావ దినోత్సవం -జెండావిష్కరణ



**తొర్రూరు , జూలై 9 (జనం సాక్షి):** జ్ఞానం శీలం ఏకత పరిషత్ ప్రత్యేకత అంటూ క్షణం క్షణం మా కణం కణం భరతమాతకే సమర్పణం అంటూ విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాడుతూ కోట్లాది మంది విద్యార్థులకు మార్గం చూపినటువంటి అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపి) 78వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈరోజు తొర్రూరు పట్టణంలో స్థానిక దత్తు ఒకేషనల్ జూనియర్ కాలేజి వద్ద ఏబీవీపి తొర్రూరు మండల కన్వీనర్ చిలుక మనోజ్ ఏబీవీపి జెండాను ఆవిష్కరించడం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 1949జులై9న డిల్లీ యూనివర్సిటీ లో కేవలం ఐదుగురు విద్యార్థులతో ప్రారంభమైన ఏబీవీపి నేడు ప్రపంచంలో అతి పెద్ద అత్యంత శక్తివంతమైన విద్యార్థి సంఘం గా ఆవిర్భవించింది అని తెలిపారు. ధేశంలో ఏ విద్యార్థికి కష్టమొచ్చినా,సమస్య ఉన్నా నేనున్నాను అంటూ ముందుండి పోరాడే ఏకైక సంస్థ అని, కేవలం విద్యార్థుల సమస్యలే కాకుండా ధేశం ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై, సవాళ్ళను కూడా ఛేదించి జాతి నిర్మాణం కోసం నిస్వార్థంగా కృషి చేస్తున్న ఏకైక సంస్థ ఏబీవీపి అని కొనియాడారు. విద్యార్థుల సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తూనే విద్యార్థులలో దేశభక్తిని ప్రభోధం చేస్తూ, భారతీయ సంస్కృతి సాంప్రదాయాలను పరిరక్షిస్తూ ధేశం కోసం ధర్మం కోసం నిరంతరం పనిచేస్తున్నది ఏబీవీపి అని తెలిపారు. హస్టల్ విద్యార్థుల సమస్యలపై పోరు, స్కాలర్షిప్,ఫీజు రీయింబర్స్మెంట్ పై పోరుబాట తో పాటుగా తెలంగాణ ఉద్యమంలో పెద్ద ఎత్తున విద్యార్థులను సమీకరించి అసెంబ్లీ ముట్టడించి విద్యార్థుల సత్తాను ప్రపంచానికి చాటి చెప్పిన ఘనత ఏబీవీపి కే దక్కింది అని,విద్యర్థులలోదాగియున్న ప్రతిభను, సృజనాత్మకతను వెలికి తీసేవిధంగా అనేక సేవా కార్యక్రమాలు నిరంతరం చేపడుతున్న సామాజిక సంస్థ ఏబీవీపి అని,ఏబీవీపి ఆవిర్భావ దినోత్సవాన్ని జాతీయ విద్యార్థి దినోత్సవంగా ధేశం మొత్తం అనేక కార్యక్రమాలు చేస్తున్నదని,విద్యార్థులు ఏబీవీపి చేపట్టే కార్యక్రమాలలో భాగస్వామ్యులు కావాలని కోరారు. ఈకార్యక్రమంలో ఏబీవీపి సీనియర్ నాయకులు పల్లె కుమార్,పైండ్ల రాజేష్,నూకల నవీన్,సాగర్,భంటి,కార్తీక్,ఉమేష్,అరుణ్,శిరీష,అక్షయ,సౌజన్య,కరుణ ,మంజుల,అనిత తదితరులు పాల్గొన్నారు.

# సీతక్కకు కామధేను ప్రతిమను బహుకరించిన నాసిరెడ్డి



**మంగపేట, జూలై 9(జనంసాక్షి)** రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) జన్మదిన వేడుకలు గురువారం ములుగు జిల్లా కేంద్రంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, జాతీయ మిర్చి టాస్క్ ఫోర్స్ డైరెక్టర్ నాసిరెడ్డి సాంబశివరెడ్డి మంత్రిని కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శుభసూచకమైన "కామధేను" ప్రతిమను కానుక ఈ వేడుకల్లో భాగంగా, నాసిరెడ్డి సాంబశివరెడ్డి మంత్రి సీతక్కకు శాలువా కప్పి సన్మానించారు. అనంతరం హిందూ సంప్రదాయంలో పూజకు ప్రతీకగా, శుభానికి సంకేతంగా భావించే 'కామధేను' (ఆవు, లేగదూడ) కలప ప్రతిమను బహుకరించారు. ఈ సందర్భంగా సాంబశివరెడ్డి మాట్లాడుతూ... మంత్రి సీతక్క నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయాభిమానంపై మంత్రి ప్రశంసలు సాంబశివరెడ్డి అందించిన కామధేను ప్రతిమను చూసి మంత్రి సీతక్క ప్రత్యేకంగా మురిసిపోయారు. ప్రతి సంవత్సరం తన పుట్టినరోజు వేడుకల సందర్భంగా సాంబశివరెడ్డి వ్యవసాయానికి, సంప్రదాయానికి చిహ్నమైన ఏదో ఒక ప్రత్యేకమైన బహుమతిని అందజేస్తారని ఆయనలోని వ్యవసాయాభిమానాన్ని మంత్రి నాసిరెడ్డి సాంబశివరెడ్డిని అభినందించారు.

# గిరిజనులకు స్నేహపూర్వక పోలీసింగ్ అందించాలి

- సాంకేతిక సేవలను ప్రజలకు చేరవేయాలి
- పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

తాండూర్, జూలై 09(జనం సాక్షి ) రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా గురువారం రోజున వార్షిక తనిఖీల్లో భాగంగా మంచిర్యాల జోన్‌లోని మాదారం పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న పోలీస్ కమిషనర్‌కు మంచిర్యాల జోన్ డీసీపీ ఎ.భాస్కర్, బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్,తాండూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ దేవయ్య,ఎస్ఐ సౌజన్య పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం సాయుధ దళ పోలీసుల గౌరవ వందనాన్ని పోలీస్ కమిషనర్ స్వీకరించారు. తదనంతరం స్టేషన్ పరిసరాలు,వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలు, పోలీస్ స్టేషన్ ఆవరణలోని క్రీడా ప్రాంగణం, పోలీస్ వాహనాల నిర్వహణను పరిశీలించారు. ప్రతి పోలీస్ వాహనంలో ఫస్ట్ ఎయిడ్ కిట్, డ్రాగన్ లైట్, తాళ్లు, ట్రాఫిక్ కోన్స్, క్రైమ్ ప్రొటెక్షన్ రిబ్బన్, రైట్ గేర్ కిట్ (హెల్మెట్, స్టోన్ గార్డ్, లాఠీ, బాడీ ప్రొటెక్టర్) తప్పనిసరిగా ఉండాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లోని కమ్యూనికేషన్ వ్యవస్థ పనితీరును పరిశీలించారు. పోలీస్ స్టేషన్ నుంచి సమాచారం అందినప్పుడు కంట్రోల్ రూమ్ సిబ్బంది అప్రమత్తత, స్పందన తీరు ఎలా ఉందో కమ్యూనికేషన్ సెట్ ద్వారా మాట్లాడి తెలుసుకున్నారు. స్టేషన్‌కు సంబంధించిన రికార్డులు, రౌడీషీటర్లు, అనుమానితుల వివరాలను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ సంబందించిన పూర్తి రికార్డ్స్ ,పెండింగ్ కేసులు ,తదితర వివరాలను ఎస్ఐ, సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. అలాగే సిబ్బందితో మాట్లాడి వారి విధులు, ఎదురవుతున్న సమస్యల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ...., విస్తారమైన గ్రామీణ, గిరిజన ప్రాంతాలకు సేవలందిస్తున్న మాదారం పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజలకు మరింత స్నేహపూర్వకంగా, అందుబాటులో ఉండే పోలీసింగ్ అందించాలని సూచించారు. గిరిజనులతో సున్నితంగా వ్యవహరిస్తూ వారి సమస్యలను అర్థం చేసుకుని విశ్వాసాన్ని పెంపొందించాలని ఎస్ఐ, సీఐలకు ఆదేశించారు. పోలీస్ శాఖలో అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక సేవలు, సీసీటీఎన్ఎస్,హాక్ ఐ, టీఎస్ కాప్ వంటి యాప్‌లను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. యువతకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించేలా ప్రణాళిక రూపొందిస్తున్నామని తెలిపారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా మహిళల భద్రత, చిన్నారుల రక్షణకు చేపడుతున్న ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలను అత్యంత ప్రాధాన్యంతో అమలు చేయాలని సూచించారు. గంజాయి,ఇతర మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులు,యువత, తల్లిదండ్రులు, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. అలాగే సీసీ కెమెరాల ఏర్పాటు,వాటి ప్రయోజనాలు, ప్రాముఖ్యత,సైబర్ నేరాల నివారణ, రహదారి భద్రత, ట్రాఫిక్ నియమాలపై నిరంతరం అవగాహన కల్పించాలని సూచించారు. స్టేషన్ ఎస్ఐలు తమ పరిధిలో విజిబుల్ పోలీసింగ్,పెట్రోలింగ్, ఆకస్మిక వాహన తనిఖీలు నిరంతరం నిర్వహించి నేరాల నియంత్రణతో పాటు ముందస్తు సమాచారాన్ని సేకరించాలని ఆదేశించారు. భారీ వర్షాలు,ప్రకృతి వైపరీత్యాలు వంటి అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా ముందస్తు కార్యాచరణ ప్రణాళిక (ఎమర్జెన్సీ రెస్పాన్స్ ప్లాన్) సిద్ధంగా ఉంచాలని అధికారులకు సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో సీపీ పోలీస్ అధికారులతో కలిసి మొక్కలు నాటడం జరిగింది. మాదారం పోలీస్ స్టేషన్ నిర్వహణ, సౌకర్యాలు,పనితీరు సంతృప్తికరంగా ఉన్నాయని పేర్కొంటూ ఎస్ఐ, సీఐతో పాటు స్టేషన్ సిబ్బందిని పోలీస్ కమిషనర్ అభినందించారు.

# పరుగులో ప్రతిభ చాటిన సెయింట్ మేరీస్ విద్యార్థులు

- జిల్లా స్థాయి అథ్లెటిక్స్‌లో రాణించిన విద్యార్థులను సన్మానించిన కరస్పాండెంట్ రాష్ట్రస్థాయికి ఎంపిక



**గోవిందరావుపేట. జులై.( జనం సాక్షి ). 09.07.26.** జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన సెయింట్ మేరీస్ హైస్కూల్, పసర విద్యార్థులను పాఠశాలలో గురువారం ఘనంగా సన్మానించారు. **10**వ తరగతి విద్యార్థిని ఎం. రుద్రాక్షిత **600** మీటర్ల పరుగుపందెంలో రాష్ట్ర స్థాయికి ఎంపిక కాగా, **5**వ తరగతి విద్యార్థిని కదారి శాన్వి **200** మీటర్ల పరుగుపందెంలో అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి అర్హత సాధించింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ స్టీఫెన్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల విజయం పాఠశాలకు ఎంతో గర్వకారణమని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తూ మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఘన విజయానికి కృషి చేసిన శారీరక విద్య ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులను అభినందించారు. విద్యార్థుల ఈ విజయంపై పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ అత్యుత్తమ ప్రతిభ కనబర్చి పతకాలు సాధించాలని శుభాకాంక్షలు తెలిపారు.

# పేదలకు పట్టాలిచ్చి ప్రజాపాలనగా నిరూపించుకోండి

**గుండ్ల సింగారం సందర్శించిన పల్లా, తక్కళ్ళపల్లి, నెల్లికంటి**



**హనుమకొండ ప్రతినిధి జులై 9 (జనం సాక్షి) :** రాష్ట్రంలో ప్రజాసమస్యలు పరిష్కరిస్తేనే కాంగ్రెస్ తో కమ్యూనిస్టుల రాజకీయ మైత్రి కొనసాగుతుందని సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా పరిధిలోని గుండ్ల సింగారంలోని సురవరం సుధాకర్ రెడ్డి నగర్ లో ఇండ్ల కూల్చివేత జరిగిన ప్రాంతాన్ని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో కలిసి పల్లా వెంకట్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా కాలనీలో కాల్చివేయబడిన సురవరం సుధాకర్ రెడ్డి భవన్ తో పాటు వందలాది పేదల గుడిసెలను పరిశీలించి అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పల్లా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలిచ్చి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ దశాబ్దాలుగా పేదలకు భూములు, గృహ వసతి కోసం కమ్యూనిస్టులే నిరంతరం పోరాడుతున్నారని గుర్తుచేశారు. హనుమకొండ గుండ్ల సింగారంలో సర్వే నెంబర్లు 174,175లలో నేడు చెరువు శిఖం భూమి లేనే లేదని, గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో పేదలకు 1360 మందికి ఇంటి స్థలాలు ఇచ్చారని అన్నారు. గత ఐదేళ్ళుగా అక్కడ పేదలు సిపిఐ ఆధ్వర్యంలో భూ పోరాటం నిర్వహించి గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారని అన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ పేదలకు గూడు రాజ్యాంగం కల్పించిన హక్కు అని, దానిని నెరవేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. గుండ్ల సింగారంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇండ్ల స్థలాలు కేటాయించి, పట్టాలు ఇవ్వాలనే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతామని, శాసన సభలో సైతం ఒత్తిడి తెస్తామని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాషుమియా, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, రాష్ట్ర సమితి సభ్యులు అదరి శ్రీనివాస్, నల్లు సుధాకర్ రెడ్డి, వలి ఉల్లా ఖాద్రీ, మండల కార్యదర్శి ఎన్ అశోక్ స్టాలిన్, సీనియర్ నాయకులు మోతె లింగారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు పుట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, బత్తిని సదానందం, మునిగాల బిక్షపతి, బాషబోయిన సంతోష్, కొట్టేపాక రవి, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.




## పెద్దవంగర కేజిబీవీ పాఠశాల తనిఖీ

**పెద్దవంగర జులై 09(జనం సాక్షి) :** పరిసరాలు తరగతి గదులు పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీఓ సురేష్ బాబు అన్నారు. గురువారం మండలంలో చిన్నవంగర గ్రామంలో కే జి బీ వీ పాఠశాలను సందర్శించారు. పాఠశాలల పరిసరాలు తరగతి గదులు, వంట గదులు, మరుగుదొడ్లను, పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని, మెరుగైన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఓ స్రవంతి, సోమన్న, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్ అందజేత

**కాజీపేట. జూలై 9 (జనం సాక్షి) :** వేలేరు మండల కేంద్రంలోని పేద కుటుంబలకు చెందిన వారు అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వేణు, శంకరయ్య, ఎల్లమ్మ, అనీల్, విషయం బిల్లా యాదగిరి, వేలేరు మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు సర్పంచ్ ,వేలేరు మేజర్ గ్రామ పంచాయితి దృష్టి కి రావడంతో, ఇట్టి విషయాన్ని కడియం శ్రీహరి కి తెలియజేయడం జరిగింది. వెంటనే స్పందించి, ముఖ్య మంత్రి సహాయ నిధి . సీఎంఆర్ఎఫ్ ద్వారా 125000/ఒక లక్ష ఇరువై ఐదు వెయ్యిలు రూపాయలు చేక్ లను వారి కుటుంబ సభ్యులకు వేలేరు మండల కేంద్రంలోని రైతు వేదిక నందు మాజీ ఉప ముఖ్యమంత్రి వర్యులు స్టేషన్ ఘనపూర్ కడియం శ్రీహరి అందజేశారు..



# జోరుగా బెల్ట్ షాపుల దందా!

బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులు, ముఖ్యంగా మహిళలు, విద్యార్థినులు ఈ మందుబాబుల ప్రవర్తనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బడి పిల్లల ముందే ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. గ్రామాల్లో బెల్ట్ షాపులను అరికట్టాల్సిన ఎక్సైజ్ శాఖ పనితీరు తీవ్ర విమర్శలపాలవుతోంది. అధికారుల అండదండలతోనే బెల్ట్ షాపుల నిర్వాహకులు రెచ్చిపోతున్నారని, ఫిర్యాదులు చేసినా ఫలితం ఉండటం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా కళ్ళు తెరుస్తారా అని మండల ప్రజలు ప్రశ్నిస్తూ పలిమెల మండలంలో యథేచ్ఛగా సాగుతున్న బెల్ట్ షాపుల దందాకు అడ్డుకట్ట వేయాలని, పంకెన బస్టాండ్ పరిసరాల్లో మందుబాబుల వేధింపుల నుండి ప్రయాణికులకు, విద్యార్థులకు రక్షణ కల్పించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఇప్పటికైనా క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇలాంటి అసాంఘిక కార్యకలాపాల వల్ల గ్రామాల్లో ప్రశాంత వాతావరణం దెబ్బతిని, పౌరహక్కులకు తీవ్ర భంగం వాటిల్లుతోందని బహిరంగంగా మద్యం తాగుతూ సామాన్య ప్రజల స్వేచ్ఛను, హక్కులను కాలరాస్తున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దారుణం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పౌరుల హక్కులను కాపాడాలని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. పౌరునిపై దుర్భాషలాడిన బెల్ట్ షాపు యజమాని తోపాటు మండలంలోని అన్ని బెల్ట్ షాపుల యజమానులకు సమాజంలో పౌర హక్కుల గురించి మండల తాసిల్దార్ ఒక సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తూ ప్రతి షాపులో పౌరహక్కుల అవగాహన పోస్టర్లను ప్రజలకు కనపడేలా ఏర్పాటు చేయాలని, దుర్భాషలాడిన బెల్ట్ షాప్ యజమానిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# మంత్రి సీతక్కకు జన్మదిన శుభాకాంక్షలు

**తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రతినిధులు**



**ములుగు ప్రతినిధి, జులై 09(జనంసాక్షి) :** రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క జన్మదినం సందర్భంగా తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ములుగు జిల్లా అధ్యక్షులు ఎం.సంపత్ రావు ఆధ్వర్యంలో అసోసియేషన్ ప్రతినిధులు గురువారం ములుగు మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి, పూల బొకే అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గెజిటెడ్ అధికారులు కె కోమరయ్య, శిరీష, రఫిక్, రాజు, వై యశ్వంత్, డి రాజు, సందీప్, గోపాల్ రావు, ధర్మనాయక్, సిద్దార్థ్ రెడ్డి, లాల్ నాయక్ తదితర నాయకులతో పాటు తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జాడి రాంబాబుకు ఘన సన్మానం



**ఏటూరునాగారం, జూలై 09(జనంసాక్షి) :** కన్నాయిగూడెం మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన యువ నాయకుడు, బుట్టాయిగూడెం గ్రామ సర్పంచ్ జాడి రాంబాబు కు ఏటూరునాగారం లో దళిత ప్రజా సంఘాల నాయకులు గురువారం ఘన సన్మానం నిర్వహించారు. శాలువ కప్పి పుష్పగుచ్ఛం అందజేసి, జ్ఞాపికను బహూకరించి తమ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మాల మహానాడు, నేతకాని హక్కుల పోరాట సమితి, మాదిగ హక్కుల పోరాట సమితి, దళిత ప్రజా సంఘాల నాయకులు గంపల శివకుమార్, చిక్కుల విజయ్, కందుకూరి రతన్, పడిదల హనుమంత్, దుర్గం కొమరయ్య, జాడి రవీందర్, గోగు కొమరయ్య, ఏంపెల్లి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఐటీ కంపెనీల్లో కార్లు అటాచ్‌మెంట్ ఇప్పిస్తామని మోసం

స్వాధీనం చేసుకున్నారు.ప్రధాన నిందితుడు సింగారపు శ్యామ్ కుమార్ గతంలో కూడా ఇలాంటి మోసాలకు పాల్పడి, చెన్నారావుపేట, ఇంటేజార్‌గంజ్, ఏ.జే. మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్లలో నమోదైన పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు.పరారీలో ఉన్న మిగిలిన నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని, ఇతర బాధితులను గుర్తించడం, మిగిలిన వాహనాలను స్వాధీనం చేసుకోవడం, డిజిటల్, ఆర్థిక ఆధారాలను సేకరించడం వంటి అంశాలపై దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు. అరెస్టు చేసిన ఇద్దరు నిందితులను గౌరవ న్యాయస్థానంలో హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు ఏ.జే. మిల్స్ కాలనీ పోలీసులు వెల్లడించారు.

## రీ-టెండర్ నోటిఫికేషన్

**జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం, జనగామ జిల్లా**

**జనగామ ప్రతినిధి, జులై 9(జనంసాక్షి ):** జనగామ జిల్లాలోని కేజీబీవీలు, మోడల్ స్కూల్ బాలికల హాస్టళ్లు మరియు పట్టణ నివాస పాఠశాల, జనగామలకు 2026–27 విద్యా సంవత్సరానికి కూరగాయలు, పండ్లు, చికెన్ ఢ మటన్ సరఫరా కొరకు నియోజకవర్గాల వారీగా రీ–టెండర్ ఫారాలు ఆసక్తిగల సరఫరాదారుల నుండి ఆహ్వానించబడుచున్నవి. జనగామ నియోజకవర్గం (08 విద్యాసంస్థలు): కేజీబీవీ తరిగొప్పుల, కేజీబీవీ నర్మెట్ట, కేజీబీవీ జనగామ, కేజీబీవీ బచ్చన్నపేట, మోడల్ స్కూల్ బాలికల హాస్టల్–చౌడారం, మోడల్ స్కూల్ బాలికల హాస్టల్–బచ్చన్నపేట, మోడల్ స్కూల్ బాలికల హాస్టల్––నర్మెట్ట, పట్టణ నివాస పాఠశాల, జనగామ. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గం (08 విద్యాసంస్థలు): కేజీబీవీ జఫర్‌గడ్, కేజీబీవీ చిల్పూర్, కేజీబీవీ లింగాల ఘన్‌పూర్, కేజీబీవీ రఘునాథపల్లి, కేజీబీవీ స్టేషన్ ఘన్‌పూర్, మోడల్ స్కూల్ బాలికల హాస్టల్–వెల్లి, మోడల్ స్కూల్ బాలికల హాస్టల్–స్టేషన్ ఘన్‌పూర్, మోడల్ స్కూల్ బాలికల హాస్టల్–జఫర్‌గడ్. పాలకుర్తి నియోజకవర్గం (04 విద్యాసంస్థలు): కేజీబీవీ పాలకుర్తి, కేజీబీవీ కొడకండ్ల, కేజీబీవీ దేవరుప్పుల, మోడల్ స్కూల్ బాలికల హాస్టల్–కొడకండ్ల. టెండర్ ఫారం రుసుము: ప్రతి విద్యాసంస్థకు రూ.2,000/– చొప్పున. కూరగాయలు: ప్రతి విద్యాసంస్థకు రూ.30,000/– చొప్పున. పండ్లు: ప్రతి విద్యాసంస్థకు రూ.20,000/– చొప్పున. చికెన్ ఢ మటన్: ప్రతి విద్యాసంస్థకు రూ.30,000/– చొప్పున. ముఖ్యమైన తేదీలు: టెండర్ ఫారాల విక్రయం: 10–07–2026 నుండి 16–07–2026, 3.00 గంటల వరకు (కార్యాలయ పనివేళల్లో) సీల్డ్ టెండర్ల సమర్పణకు చివరి తేదీ: 16–07–2026 సాయంత్రం 5.00 గంటల వరకు. టెండర్ల తెరవడం: 17–07–2026న జిల్లా కొనుగోలు కమిటీ (ఖాజ) సమక్షంలో నిర్వహించబడును.

## తహసిల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన అదనపు కలెక్టర్



**రేగొండ,(కొత్తపల్లి గోరి) జూలై 09( జనం సాక్షి):** కొత్తపల్లిగోరి తహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డులను పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న పలు భూ సమస్యలపై రెవెన్యూ అధికారులతో చర్చించారు. ముఖ్యంగా బల్క్ ల్యాండ్ వివాదాలు, సాదాబైనామా దరఖాస్తుల పురోగతిపై ఆయన సమీక్ష నిర్వహించారు. అర్హులైన రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, సాదాబైనామా ప్రక్రియను వేగవంతం చేసి వీలైనంత త్వరగా పరిష్కరించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. అనంతరం అదనపు కలెక్టర్ నిజాంపల్లి గ్రామ పరిధిలోని 285 మరియు 286 పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణల కార్యక్రమం అమలు తీరును ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పోలింగ్ విధుల్లో ఉన్న బీఎల్‌ఓలు మరియు బీఎల్‌ఓ సూపర్వైజర్లు ఓటర్ల వివరాల డిజిటలైజేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని తెలిపారు. ఎలాంటి తప్పులు లేకుండా ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హేమ ర బీఎల్‌ఓలు మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.